నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

నిజామాబాద్-కామారెడ్డి

1

శుక్రవారం | సెప్టెంబర్ 29, 2023 | www.navatelangana.com

పోరాటాలతో సమస్యలకు పరిష్కారం

భగత్‌సింగ్ జయంతి వేడుకల్లో ఎస్ఎఫ్ఐ



నవతెలంగాణ-జుక్కల్

సమస్యలు ఎదురైనప్పుడు పోరాటాలతోనే వాటిని పరిష్కరించుకోవచ్చని ఎస్ఎఫ్ఐ నాయకులు తెలిపారు. అందుకు భగత్‌సింగ్‌ను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఎస్ఎఫ్ఐ మండల శాఖ ఆధ్వర్యంలో గురువారం కామ్రేడ్ భగత్ సింగ్ 116వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్ సింగ్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళ్లు అర్పించి జయంతి వేడుకలను నిర్వహించారు. నాయకులు అజయ్, ఆఫ్రోజ్ మాట్లాడుతూ భారత దేశ స్వాతంత్ర పోరాటంలో విద్యార్థి దశలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. అన్యాయాన్ని సహించకుండా తిరుగుబాటు ఉద్యమం చేశారని తెలిపారు. భగత్‌సింగ్‌ను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోని విద్యాపరంగా విద్యార్థులకు ఎటువంటి సమస్యలు వచ్చిన ఎస్ఎఫ్ఐ వారి వెంట ఉంటుందని వారు తెలిపారు. వేడుకలలో మండల నాయకులు సాగర్ , ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

వర్షంలోనూ కొనసాగిన అంగన్వాడీల సమ్మె

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని తాసిల్దార్ కార్యాలయం ముందు గురువారం అంగన్వాడీల సమ్మె వర్షంలోనే 18వ రోజు కొనసాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... ప్రభుత్వం మొండి వైఖరిని వీడి, అంగన్వాడీలను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలని, రూ 26 వేల వేతనం చెల్లించాలని, పదవి విరమణ సమయంలో రూ ఐదు లక్షలు ఆయాలకు, రూ 10 లక్షలు టీచర్లకు చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు ఇందిరా, బొమ్మిడి సుజాత, వెంకటా లక్ష్మి, సావిత్రి, శ్రీదేవి, పద్మజ, విజయ, ఆయాలు రాధా, మైసమ్మ, తదితరులు పాల్గొన్నారు.



కొనసాగుతున్న అంగన్‌వాడీల సమ్మె

నిమజ్జన శోభ



- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గణేశ్ నిమజ్జన శోభాయాత్ర
- డీజే మోతలతో యువకుల కోలాహలం
- భారీ బందోబస్తు చేపట్టిన పోలీస్ యంత్రాంగం



కామారెడ్డి జిల్లా కేంద్రంలో భారీ గణనాథుల తరలింపు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ/కామారెడ్డి(తాడ్వాయి)

11 రోజుల పాటు పూజలందుకు గణనాథుడు నిమజ్జనానికి తరలివెళ్లాడు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గణేశ్ నిమజ్జన శోభ నెలకొంది. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో సార్వజనిక్ గణేశ్ మండలి రథయాత్రను కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు జెండా ఊపి ప్రారంభించారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో భారీ గణనాథులు నిమజ్జనానికి తరలాయి. మండలాల్లో సైతం గణేశ్ నిమజ్జన సందడి నెలకొంది. డీజే మోత, డప్పుల సప్పుల మధ్య చిన్నా పెద్ద ఆడి పాడి గణపయ్యను సాగనంపారు.

నిజామాబాద్ జిల్లా కేంద్రంలో నిమజ్జనానికి గణనాథులు తరలాయి. పెద్దబజార్ మీదుగా ఆర్యసమాజ్, గోల్ హనుమాన్, పూలాంగ్ మీదగా గణేశ్ శోభయాత్ర కొనసాగింది. నగరంలోని దుబ్బా ప్రాంతం నుంచి సార్వజనిక్ గణేశ్ మండలి ఆధ్వర్యంలో గణేశ్ రతయాత్రను కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు జెండా ఊపి ప్రారంభించారు. దుబ్బా మీదుగా శివాజీ చౌక్ నుంచి గంజ్, గాంధీ చౌక్, నెహ్రూపార్క్ మీదుగా గురుద్వారా, పెద్దబజార్, గోల్‌హనుమాన్, పూలాంగ్ నుంచి వినాయకుల బావి వరకు కొనసాగింది. చంద్రయాన్-3 నమూనాను అనుసరిస్తూ, అందంగా అలంకరించిన శోభాయాత్ర రథం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రథన్ని ఎడ్లతో కలిసి స్థానికులు వినాయకుల బావి వరకు లాగారు. దారి పొడువునా కొబ్బరి కాయలు కొడుతూ ప్రత్యేక పూజలు చేశారు.

సార్వజనిక్ గణేష్ మండలి వద్ద పూజలు

వినాయక నిమజ్జనోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు గురువారం మధ్యాహ్నం దుబ్బ ప్రాంతంలోని సార్వజనిక్ గణేష్ మండలి వద్దకు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వినాయక నిమజ్జన శోభాయాత్ర రథం వద్ద టెంకాయ కొట్టారు. ఈ సందర్భంగా సార్వజనిక్ గణేష్ మండలి అధ్యక్షుడు బంటు గణేష్ ఇతర ప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, పుర ప్రముఖులు కలెక్టర్ కు స్వాగతం పలికారు. జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్నగారి విఠల్ రావు, అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా, నగర మేయర్ దండు నీతూ కిరణ్, రాష్ట్ర మహిళా సహకార అభివద్ధి సంస్థ చైర్పర్సన్ ఆకుల లలిత, అదనపు కలెక్టర్ పి.యాదిరెడ్డి, అదనపు డీసీపీ జయరాం, మాజీ శాసన సభ్యుడు యెండల లక్ష్మీనారాయణ తదితరులు సైతం కలెక్టర్ తో కలిసి పూజల్లో పాల్గొన్నారు. అక్కడే గల బాలగంగాధర్ తిలక్ విగ్రహానికి సార్వజనిక్ మండలి ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జెండా ఊపి శోభాయాత్ర రథాన్ని ప్రారంభించారు. గణేష్ నిమజ్జనోత్సవాన్ని ఆనందోత్సా హాల నడుమ, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు. శోభాయాత్రకు ఎలాంటి ఆటంకాలు తలెత్తకుండా జిల్లా యంత్రాంగం తరపున అన్ని ఏర్పాట్లు చేశామని అన్నారు. నిమజ్జనోత్సవం సజావుగా సాగేలా పర్యవేక్షణ జరపాలని తన వెంట ఉన్న అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆయా శాఖల అధికారులు ఉన్నారు.

కామారెడ్డి పట్టణ కేంద్రంలో బుధవారం రాత్రి గణేష్ శోభాయాత్ర ప్రారంభమైంది. డప్పు వాయిద్యాలతో వివిధ రకాల విన్యాసాలతో గణేష్ శోభాయాత్రను గురువారం సాయంత్రం వరకు నిర్వహించారు. గణేష్ శోభయాత్రకు వివిధ గ్రామాల నుంచి అనేక భక్తులు వచ్చి శోభాయాత్రలో పాల్గొన్నారు.



కామారెడ్డిలో..



బోధన్‌లో



వినాయకుల బావి వద్ద చిట్టిగణపయ్యను తరలిస్తున్న యువతీయువకులు



బావిలో నిమజ్జనం



బాసర వద్ద గోదావరిలో గణనాథుల నిమజ్జనం..



టిఫిన్ సెంటర్ మాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

ఎంఎస్ స్వామినాథన్ మృతి రైతులకు తిరనిలోటు

నవతెలంగాణ-పిట్లం

భారత హరిత విప్లవ పితామహుడు ప్రొఫెసర్ ఎంఎస్ స్వామినాథన్ మృతి రైతులకు తీరనిలోటని బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. మండల కేంద్రంలోని మార్కెట్ యార్డ్‌లో గురువారం ప్రొఫెసర్ ఎమ్మెస్ స్వామినాథన్ మృతి పట్ల ఆయన చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు.



నివాళి అర్పిస్తున్న పలువురు

ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ స్వామినాథన్ రైతులు అభివృద్ధి చెందడానికి హైబ్రిడ్ విత్తనాలు తీసుకొచ్చిన హరిత విప్లవోద్యమ వాది యని పలువురు కొనియాడారు. ప్రభుత్వంలో ఉంటూనే ఎన్నో కమిటీలకు అధ్యక్షుడిగా ఉంటూనే రైతుల పక్షాన జీవితాంతం పోరాడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించి , ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చిన ఘనత ఆయనకు దక్కిందన్నారు. ఆయన మృతి యావత్ దేశానికి తీరని లోటు అని కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు అన్నారం వెంకటరామిరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వాసవి రమేష్, మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు దేవేందర్ రెడ్డి , చిన్న కొడప్ గల్ సింగిల్ విండో చైర్మన్ నారాయణరెడ్డి , మాజీ జెడ్పిటిసి ప్రతాప్ రెడ్డి , జీ వైస్ ఎంపీపీ నర్సా గౌడ్ , నాయకులు శ్రీనివాస్ రెడ్డి , బుడాల నవీన్ తదితరులు పాల్గొన్నారు.

పెంపుడు జంతువులకు రేబిస్ టీకాలు వేయించాలి

- జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్

నవతెలంగాణ-తాడ్వాయి

పెంపుడు జంతువులు రేబిస్ వ్యాధికి గురికాకుండా తప్పకుండ రేబిస్ టీకాలు వేయించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు. లూయిస్ పాశ్చర్ వర్ధంతి సందర్భంగా ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 28 న ప్రపంచ రేబిస్ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం నాడు జిల్లా పశు వైద్య అధికారి సింహ రావు తో కలిసి రేబిస్ వ్యాధి లక్షణాలు, తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. రేబిస్ అనే ఒక భయంకరమైన వైరస్ వల్లే వచ్చే వ్యాధి అని అన్నారు. కుక్కలు, పిల్లి, ఎలుక వంటి పెంపుడు జంతువులు కరవడం, చొంగ కార్చడం వాళ్ళ ఇతర జంతువులకు, మనుషులకు రేబిస్ వ్యాధి వచ్చే అవకామేశముందని అన్నారు. రేబిస్ వచ్చినట్లు అనుమానం వచ్చిన వెంటనే పెంపుడు జంతువులకు టీకాలు వేయించాలన్నారు. ప్రతి సంవత్సరం సమీపంలోని పశు వైద్యశాలలలో పెంపుడు జంతువులకు రేబిస్ టీకాలు వేయించాలని సూచించారు. పెంపుడు కుక్క కరిచినా వెంటనే యాంటీ వైరస్ టీకా వేయించుకోవడంతో పాటు సబ్బుతో కడిగి 15 నిముషాలు పాటు ధారాళంగా వచ్చే నీటి కుళాయి కింద ఉంచాలన్నారు. ఆరు బయట సంచరించే జంతువులను ముట్టుకోరాదని, వాటిని రెచ్చగొట్టరాదని హితవు పలికారు. అలాగే చికెన్, మాంసం వ్యర్థ పదార్థాలు వీధులలో పడేయరాదని సూచించారు.

కొత్తమెనూ పేరుతో ప్రచారం..

కార్మికుల పట్ల కక్షపూరితం

- మధ్యాహ్న భోజన కార్మికుల నిరవధిక సమ్మె ప్రారంభం

నవతెలంగాణ-కంఠేశ్వర్



నినాదాలు చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు, సీఐటీయూ నాయకులు

తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ధర్నా చౌక్‌లో మధ్యాహ్న భోజన కార్మికుల నిరవధిక సమ్మె శిబిరాన్ని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రమేష్ బాబు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకం లో నూతన మెనూని అమలు చేస్తామని పేరుతో ప్రచార ఆర్భాటాన్ని చూపిస్తుంది కానీ ఆ పథకంలో పని చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికుల విషయంలో మాత్రం కక్షపూరితంగా వ్యవహరిస్తుందని అన్నారు. జిల్లాలో ఎనిమిది కోట్లకు పైగా బిల్లును పెండింగ్లో ఉన్నాయని అన్నారు. అదేవిధంగా ముఖ్యమంత్రి ప్రకటించిన 3000 వేతనాన్ని సంవత్సరం నర గడుస్తున్న ఇప్పటివరకు ఇవ్వలేదని ఎద్దేవా చేశారు.

తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్యాల గోవర్ధన్ మాట్లాడుతూ.. ఘనంగా బడ్జెట్ ని విడుదల చేశామని చెబుతున్నా కార్మికుల ఖాతాల్లో చేరలేదని అన్నారు. రాగిజావ కు నూతన మెనూ అమలుకు, అల్పాహారానికి సరుకులను ప్రభుత్వమే సరఫరా చేసి, అదనపు బడ్జెట్‌ను కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్మికులందరికీ యూని ఫామ్‌లు పీఎఫ్ ఈఎస్ఐ ప్రమాద బీమా సౌకర్యాలను కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షురాలు చామంతి లక్ష్మి నాయకులు సుజాత, లక్ష్మి సురేందర్ రెడ్డి, పర్వవ్వ, బాలరాజు, కనకయ్య, తుకారాం నాయక్ తదితరులు పాల్గొన్నారు.

లడ్డు వేలం పోటాపోటీ

బోధన్‌తో రూ.5.11 లక్షలు

నవతెలంగాణ-పెద్దకొడప్ గల్/బోధన్

గణేశ్ మండపాల వద్ద లండూల వేలం పోటాపోటీగా సాగింది. ఎలాగైనా లడ్డు ప్రసాదాన్ని దక్కించుకునేందుకు ఔత్సాహికులు పోటీ పడి మరి పాట పాడి దక్కించుకున్నారు.



పెద్దకొడప్‌గల్‌లో..



బోధన్‌లో..

పెద్ద కొడపగల్ మండల కేంద్రంలోని శివ సాయి గణేష్ మాండలి లడ్డు వేలం ధర రికార్డు స్థాయిలో పలకింది. మండల కేంద్రంతో పాటు మండలంలోని వివిధ గ్రామాలలో 11 రోజుల నుండి పూజలు అందుకున్న గణనాథునికి మాండల ప్రజలు ఘన్నగా వీడ్కోలు పలికారు. మండల కేంద్రంలో గురువారం గణేష్ యాత్ర శోభాయమన్నంగా సాగింది. నవరాత్రి ఉత్సవాలో భాగంగా 11 రోజుల పాటు గణనాథులకు ప్రత్యేక పూజలు చేసి చివరి రోజున గణేష్ మండపాల వద్ద లడ్డు వేలం పాటలు నిర్వహించి అధిక ధర పలికిన వారికి గణేష్ నిర్వాహకులు లడ్డును అందించి శాలువా తో సన్మానించారు.

మండల కేంద్రంలో శివ సాయి గణేష్ లడ్డూ ధర రికార్డు ధర 55,000 రూపాయలకు పట్లోల హరీష్ రెడ్డి దక్కించుకున్నారు. నిమ్మజనం సందర్భంగా నిర్వాహకులు మండపాల వద్ద అన్నదాన కార్యక్రమం చేశారు.

రూ.5.11 లక్షలు పలికిన లడ్డు వేలం

బోధన్ : బోధన్ పట్టణంలోని ఏకచక్రేశ్వర శివాలయంలో గల సార్వజనిక్ గణేష్ మండలి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన లడ్డు వేలం పాటలో బోధన్ మున్సిపల్ చైర్మెన్ తూము పద్మావతి శరత్ రెడ్డి దంపతులు 5.11 లక్షలకు లడ్డు దక్కించుకున్నారు. ఈ వేలం పాటలో రాజకీయ అగ్ర నాయకులు పాల్గొని రసవత్తరంగా కొనసాగించారు. అనంతరం వీడీసీ చైర్మెన్ బాగారెడ్డి, ఆలయ చైర్మెన్ బీర్కూర్ బుజ్జి తూము పద్మ శరత్ రెడ్డి దంపతులకు లడ్డు అందించారు.

బందోబస్తును పర్యవేక్షించిన పోలీస్ కమిషనర్



నిజామాబాద్ నగరంలో పర్యటిస్తున్న సీపీ

నవతెలంగాణ-కంఠేశ్వర్/బోధన్/బోధన్‌టౌన్

నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్‌లో పోలీస్ బందోబస్తును సీపీ సత్యనారాయణ పర్యవేక్షించారు. మిలాద్ ఉన్ నబీ పండుగ నేపథ్యంలో నిజామాబాద్ ఒకటవ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నెహ్రూ పార్క్ చౌరస్తా వద్ద నిర్వహించినటువంటి సభ వేదిక వద్ద ఏర్పాట్లను క్షుణ్ణంగా పర్యవేక్షించారు. ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా నిజామాబాద్ డిప్యూటీ పోలీస్ కమిషనర్ ఎస్ జయరాం , నిజామాబాద్ ఏసిపి కిరణ్ కుమార్, ట్రాఫిక్ ఏసిపి నారాయణ, టాస్క్ ఫోర్స్ ఏసిపి రాజశేఖర్ రాజు, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ శ్రీశైలం, సిఐలు ఎస్సైలు, మరియు స్పెషల్ పార్టీ సిబ్బంది, సంబంధిత పోలీస్ స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొనడం జరిగింది.

బోధన్ : బోధన్ పట్టణం, గ్రామీణ ప్రాంతంలో గురువారం జరిగిన మిలాద్ ఉన్ నబీ, వినాయక నిమజ్జనం పండగల బందోబస్తును పోలీస్ కమీషనర్ సత్యనారాయణ పోలీసు సిబ్బందితో కలిసి బందోబస్తును పర్యవేక్షించారు. ముందుగా పట్టణంలోని నాదెల్లి మసీదు వద్ద బందోబస్తు పరిశీలించి పండగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సంధర్భంగ ముస్లిం సోదరులు సీపీని సన్మానించారు. అనంతరం ఏక చక్రేశ్వర శివాలయం, భావని పేట్ గ్రామంలో రామాలయం వద్ద ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సంధర్భంగ సీపీ సత్యనారాయణ మాట్లాడుతూ పండగల సంధర్భంగ ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటుచేసి ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ఆయన వెంట బోధన్ ఎ.సి.పి కిరణ్ కుమార్,రూరల్ సిఐ శ్రీనివాస్ రాజ్, ఎస్ఎచ్ఓ ప్రేమ్ కుమార్, ఎస్సైలు, స్పెషల్ పార్టీ సిబ్బంది, సంబంధిత పోలీస్ స్టేషన్ సిబ్బంది తదితరులు ఉన్నారు.



బందోబస్తును పర్యవేక్షించేందుకు వచ్చిన సీపీని, పోలీసులను సన్మానించిన ముస్లింలు

టీడీపీ ఆధ్వర్యంలో రెండవ రోజు రిలే దీక్ష



నవతెలంగాణ నిజామాబాద్ సిటీ

తెలంగాణ తెలుగుదేశం పార్టీ నిజామాబాద్ పార్లమెంట్ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టు నిరసిస్తూ రెండవ రోజు గురువారం రిలే నిరాహార దీక్ష చేపట్టారు. చంద్రబాబును విడుదల చేసే వరకు నిరాహార దీక్ష కొనసాగుతుందని నిజామాబాద్ ఇన్చార్జ్ వినోద్ కుమార్ అన్నారు. కార్యక్రమంలో మైనార్టీ సెల్ అధ్యక్షులు ఫిరోజ్, అర్బన్ సీనియర్ నాయకులు శంకర్ ముదిరాజ్, లవంగా రాజు, నాగేశ్వరరావు, నావటే నర్సయ్య, ఇమ్రాన్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలే కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తాయి

• గడపగడపకు కాంగ్రెస్ పార్టీలో మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి

నవతెలంగాణ-బోధన్ టౌన్

సంక్షేమ పథకాలే కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తాయని

మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి అన్నారు. గురుఆవరం ఆచన్‌పల్లిలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి గడపగడపకు కాంగ్రెస్ పార్టీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణి, రైతులకు రెండు లక్షల వరకు రుణమాఫీ వంటి ఆరు సంక్షేమ పథకాలు కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తాయని అన్నారు. కార్యక్రమంలో బోధన్ మాజీ ఎంపీపీ గంగా శంకర్, పట్టణ అధ్యక్షుడు పాష, మాజీ కౌన్సిలర్ సాయిలు, ఆలే జనార్ధన్ మాజీ కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు. అంతకు ముందు బోధన్ పట్టణంలోని గణేష్ నిమజ్జోత్సవం సందర్భంగా ఏకచక్రేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రైతుల శ్రేయస్సుకోసం సమిష్టిగా కృషి చేయాలి



సుడాచైర్మన్ సంజీవరెడ్డిని సన్మానిస్తున్న సొసైటీ సభ్యులు

నవతెలంగాణ - మోపాల్

రైతుల శ్రేయస్సు కోసం సమిష్టిగా కషి చేయాలని సుడా చైర్మన్ ఈగ సంజీవరెడ్డి అన్నారు. గురువారం నగర శివారులోని బోర్గాం పి సొసైటీ మహాజనసభను సొసైటీ చైర్మన్, డిసిసిబి డైరెక్టర్ చంద్రశేఖర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న సంజీవరెడ్డి మాట్లాడుతూ... సొసైటీ పర్యవేక్షణలో ఏర్పాటు చేసే కొనుగోలు ధాన్యం కేంద్రాల వద్ద రైతులు ఎదుర్కొనే సమస్యలను, పరిష్కరించాలని సూచించారు. బోర్గాం(పి) సొసైటీ ఆర్థికంగా బలోపేతం కావడంతో పాటు అన్ని అంశాల్లో ముందంజలో ఉందని అన్నారు. సొసైటీ అభివద్ధికి తన వంతు సహాయం చేస్తారని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సొసైటీ పాలకవర్గం చైర్మన్ సంజీవరెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో డైరెక్టర్ బిజేందర్ రెడ్డి , సాయి రెడ్డి, పాల్గొన్నారు.

అంగన్‌వాడీ, ఆయాలపై ప్రభుత్వం దాడులు సిగ్గు చేటు

సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

అంగన్ వాడి, ఆయాలపై ప్రభుత్వం దాడులు సిగ్గు చేటని అని సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ అన్నారు. గురువారం సిపిఐ జిల్లా కార్యాలయంలో ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో, చిన్నపిల్లలకు, బాలింతలకు భోజనాన్ని అందించే అంగన్వాడీ, ఆయాలపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పోలీసులను ఉపయోగించి దాడులు చేయడం క్షమించరానిదని అన్నారు. అంగన్వాడి, ఆయాలు ప్రభుత్వానికి తమ సమస్యలు పరిష్కరించాలని ఎన్నోసార్లు విన్నవించిన ఫలితం లేకపోవడంతో సమ్మె చేస్తూ నిరసనలు చేస్తున్న వారిపై పోలీసులతో దాడులు చేయించి అక్రమంగా కేసులు బనయించడం కేసీఆర్ గారికే చెల్లిందని అన్నారు. సమ్మె నిర్వహించినప్పుడు చర్చలకు పిలవడం ముఖ్యమంత్రికి, మంత్రులకు పరిపాటిగా మారిందని సమ్మెలకు వెళ్ళకముందే చర్చలు జరిపి సమస్యలు పరిష్కరించాల్సిన బాధ్యతను ప్రభుత్వం మర్చిపోయిందని అన్నారు. ఇప్పటికైనా ఎన్నికల అప్పుడు కేసీఆర్ కార్మిక వర్గానికి ఇచ్చిన హామీల నెరవేర్చాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఐ నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గ కార్యదర్శి వై ఓమయ్య,నాయకులు సంపత్, శ్రీనివాస్, రాజు పాల్గొన్నారు.

కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శిని అరెస్టు చేయడం సిగ్గుచేటు : ఏఐటీయూసీ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

మధ్యాహ్న భోజన కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శిని అరెస్టు చేయడం సిగ్గుచేటు అని ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి వై ఓమయ్య, యూనియన్ జిల్లా కార్యదర్శి చక్రపాణిలు అన్నారు. నిన్న రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి హరీష్ రావు ములుగు జిల్లాకు వెళ్లిన సందర్భంగా ఆ జిల్లాలో ఉన్న మధ్యాహ్న భోజన కార్మికులు స్థానిక ఏఐటీయూసీ నాయకుడైనటువంటి మధ్యాహ్న భోజన కార్మిక వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్‌ని, ములుగు జిల్లా మధ్యన భోజన కార్మికులను పోలీసులు అక్రమంగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లకు తరలించడానికి తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి వై ఓమయ్య, యూనియన్ జిల్లా కార్యదర్శి చక్రపాణిలు మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికుల నాలుగు నెలల బకాయి బిల్లులు చెల్లించకుండా, 22 నెల క్రితం అసెంబ్లీ సాక్షిగా రాష్ట్ర ముఖ్యమంత్రి స్వయంగా ప్రకటించిన పెంచిన వేతనాలు అమలు చేయడంలేదన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులు హరీష్ రావుకు తమ సమస్యలు చెప్పుకోవడానికి వెళుతున్న సందర్భంలో పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే కార్మికుల సమస్యల పరిష్కారం పట్ల శ్రద్ధ చూపాలని, బకాయి బిల్లులు, బకాయి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అరెస్టు చేసిన నాయకుల్ని విడుదల చేయని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఏఐటీయూసీగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

టిడిపి రిలే దీక్షకు కాంగ్రెస్ పార్టీ మద్దతు



దీక్షలో కూర్చున్న కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-వర్ని

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా వర్ని మండల కేంద్రంలో చేస్తున్న రిలే నిరాహార దీక్షను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సురేష్ బాబా ఆధ్వర్యంలో మద్దతు తెలిపారు. చంద్రబాబు బాబును అక్రమంగా అరెస్ట్ చేయటం ముఖ్యమంత్రి జగన్ మోహన్‌ఈ రెడ్డికి సరికాదన్నారు. ఆయనను వెంటనే విడుదల చేయాలని అన్నారు. కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు శనిగరం కిషన్ , బీసీ సెల్ మండల అధ్యక్షులు నారెడ్ల సాయిలు , మైనార్టీ సెల్ మండల అధ్యక్షులు శంషుద్దీన్ , సీనియర్ నాయకులు ప్రకాష్ రావు బాబా , మారుతి సెట్ , బషీర్ , జంగం శివకుమార్, వడ్డె నాగేష్ , వడ్డే రాజు ,రాము , యూత్ కాంగ్రెస్ మండల వైస్ ప్రెసిడెంట్ ఇమ్రాన్ , అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

మీ గుండె పదిలమేనా..

• నేడు వరల్డ్ హార్ట్ డే

నవతెలంగాణ-ఆర్మూర్

పిడికెడు గుండె మన జీవితాన్ని నిర్దేశిస్తుంది. గుండె మనకు అత్యంత కీలకమైన అవయవం. గుండె ఆరోగ్యంగా ఉంటే మనం ఆరోగ్యంగా ఉంటాం. ఆరోగ్యకరమైన ఆహారం, శరీరానికి వ్యాయామం, దురలవాట్లకు దూరంగా ఉండడం గుండె ఆరోగ్యానికి రాచబాట వేస్తాయి. సమయానికి నిద్రపోవడం, ఒత్తిడిని తగ్గించుకోవడం, పొగాకును మానుకుంటే చాలు మీకు గుండెపోటు వచ్చే ప్రమాదం తప్పినట్లే. అస్థిరంగా రొమ్ము నొప్పి, రక్తపోటు అధికమవడం, గుండె పని విధానంలో అసాధారణంగా ఉండడం లాంటివి కనిపించగానే వైద్యుడిని సంప్రదించాలి. ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 29 ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా వరల్డ్ హార్ట్ ఫెడరేషన్ సభ్యులు గుండె వ్యాధులు వాటికి కారణాలు జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నది.

ఆహార నియమాలు పాటించక...

చిన్నతనంలో ఆహార నియమాలు పాటించకపోతే ఎదిగే వయసులోనే గుండె జబ్బులు ఎదురయ్యే ప్రమాదం ఉంది. విద్యార్థులు జంక్ ఫుడ్, స్నాక్స్‌ను ఇష్టంగా తింటుంటారు. టిఫిన్ మొదలు రాత్రి భోజనం వరకు పిల్లల ఆహారంలో జంక్ ఫుడ్ ఉంటున్నది .అలాంటివి తినడం ద్వారా కొలెస్ట్రాల్ శాతం పెరిగి రక్తనాళాల్లో పేరుకుపోతుంది ఐదు నుంచి పదేండ్ల వయసులోనే జంక్ ఫుడ్ ప్రాసెస్డ్ ఫుడ్ కు అలవాటు పడిన వారిలో 15 నుంచి 20 ఏళ్ల వచ్చేసరికి రక్తనాళాల్లో బ్లాకులు ఏర్పడుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు. ప్రతి వెయ్యిమంది పిల్లలను ఒకరికి విద్యార్థి దశలోనే గుండె జబ్బుకు బీజం పడుతున్నది.

ఇతర జబ్బులతో ముప్పు...

మధుమేహం, అధిక బరువు, కిడ్నీ, కాలేయం వంటి జబ్బులతో బాధపడుతున్న వారిలో ఎక్కువగా గుండె జబ్బుల బారిన పడుతున్నారు. అందులో మధుమేహం హైపర్ టెన్షన్ ఉన్న 20 నుంచి 30 ఏళ్ల వయస్సు వారే. చిన్న వయసులోనే యాంజియోగ్రామ్ చేయడం స్టంట్ లు వేయాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి.

విపరీతమైన ఒత్తిడి...

విద్యార్థులు విపరీతమైన ఒత్తిడికి గురవుతున్నారు. ఉదయం ఐదు గంటలకే మొదలవుతున్న చదువులు అర్ధరాత్రి వరకు సాగుతున్నాయి. నిద్రపోయే సమయం తక్కువగా ఉంటుంది. నాలుగు గోడల మధ్య బాల్యం నలిగిపోతున్నదని వైద్యులు పేర్కొంటున్నారు. మార్కులు రావాలి. ర్యాంకులు సాధించాలని తాపత్రయంతో తల్లిదండ్రులు పిల్లల ఆరోగ్యాన్ని సరిగా పట్టించుకోవడం లేదని వైద్యులు చెబుతున్నారు.

యువకులే ఎక్కువ..

టీవీ, సోషల్ మీడియాలో కాలక్షేపం చేస్తూ చాలామంది అర్ధరాత్రి వరకు నిద్రపోవడం లేదు. ఉదయం పూట పడుకోవడం ద్వారా హార్మోన్లు దెబ్బతింటున్నాయి పడుకునే వేళల్లో పనిచేయడం పనిచేసే సమయాల్లో పడుకోవడం ద్వారా గుండె పనితీరులో తేడా ఉంటుంది. రాత్రిళ్ళు మెలుకువ ఉండే వారికి గుండె జబ్బులు అధికంగా ఉంటున్నాయి. హృద్రోగ నిపుణుల వద్దకు వచ్చే బాధితులలో యువకులే ఎక్కువగా ఉంటున్నారు. 20 నుంచి 40 ఏళ్లలోపే వారు అధికం. 18 నుంచి 20 ఏళ్లవారు ఉన్నారు 20 నుంచి 40 ఏళ్ల వారిలో 40%



మంది వరకు గుండె జబ్బు బాధితులు ఉంటున్నారు .ధూమపానం అలవాటే ఇందుకు కారణం అవుతుంది.

గుర్తించండి ఇలా...

చాతి నొప్పి వచ్చి అది కనీసం 20 నిమిషాల తర్వాత అయినా తగ్గకపోతే మీకు గుండెపోటు వచ్చినట్లే అంటున్నారు.. డాక్టర్లు ఎడమ దవడ భుజం మీదుగా నొప్పి వస్తు చేతికి విస్తరిస్తూ ఉంటే వెంటనే దావకానకు తీసుకెళ్లాలి. ఆలస్యమైతే ప్రమాద తీవ్రత పెరుగుతుంది.

అలర్ట్ అవ్వాలి..

చాతి నొప్పి ఎక్కడ వస్తుందో అక్కడ నొక్కినప్పుడు నొప్పి ఎక్కువ అవుతూ ఉంటే అలాగే ఒకవైపు తిరిగితే నొప్పి పెరుగుతూ మరోవైపు తిరిగితే నొప్పి తగ్గుతూ ఉంటే అది గుండెపోటు కాకపోవచ్చు. అందువల్ల హార్ట్ ఎటాక్ కాదా అనే దానిపై త్వరగా అలర్ట్ అవ్వాలి.



టీనేజర్లకు స్మోకింగ్ ఎఫెక్టివ్

యువతలో స్మోకింగ్ ప్రభావం అధికంగా ఉంది చిన్న వయసులోనే కొలెస్ట్రాల్ శాతం పెరిగి రక్తనాళాల్లో రక్తం సరఫరాకు అవరోధం కలుగుతున్నది. చిన్న వయసులోనే కొంతమంది పిల్లలకు గుండెకు రంధ్రాలు ఏర్పడతాయి. చికిత్స అందిస్తే టీనేజీలో గుండె జబ్బు రాదు లేకుంటే పుట్టుకతో గుండె జబ్బులు ఉన్న కొందరిలో ఆ ప్రభావం టీనేజ్లో కనిపిస్తుంది. జీవనశైలి మార్పులవల్ల గుండె జబ్బుల ముప్పు అధికమవుతుంది ఒత్తిడి లేని జీవనశైలిని అలవర్చుకోవాలి.

డాక్టర్ అజీజ్ మహమ్మద్, కార్డియాలజిస్ట్,
ఆశ సూపర్ స్పెషాలిటీ వైద్యులు, ఆర్మూర్



వ్యాయామం చేస్తూ, మానసిక ఒత్తిడిని తగ్గించుకోవాలి

గుండె జబ్బుల బారిన పడకుండా ఉండాలంటే ప్రతిరోజు వ్యాయామం చేయాలి. మానసిక ఒత్తిడిని తగ్గించుకొని సుమారుగా మూడు కిలోమీటర్లు నడవాలి ఒకే చోట కదలకుండా కూర్చోవడం చేయవద్దు కొలెస్ట్రాల్ పెరగకుండా రక్తపోటును అదుపులో ఉంచుకోవాలి నేటి యువత ట్రెండు పేరా మత్తుకు బానిస అవుతున్నారు ప్రతి చిన్న విషయాన్ని ఎక్కువగా ఆలోచించి ఒత్తిడికి గురి కావొద్దు.

డాక్టర్ నాగరాజు,, పట్టణ ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంట్, ఆర్మూర్.

ఘనంగా ఈద్ మీలాదున్ నబి సంబరాలు

నవతెలంగాణ-డిచ్‌పల్లి/రెంజల్

ఈద్ మిలాద్ ఉన్ నబీ సందర్భంగా డిచ్ పల్లి, ఇందల్ వాయి మండల కేంద్రలతో పాటు ఆయా గ్రామాలలో మసీదు నుంచి శాంతి ర్యాలీని మౌలానా మొహసిన్ రజ ప్రత్యేక ప్రార్ధనలు చేసి ప్రారంభించారు. ఈ ర్యాలీ మదీనా మస్జిద్ పైగా ఇస్లాంపుర కాలనీలోని తిరుగుతూ డిచ్పల్లి ఆర్ఎస్ వీధుల వెంబడి మొహమ్మద్ ప్రవక్త శాంతి సందేశాన్ని తెలుపుతూ గాంధీనగర్ మస్జిద్ వరకు చేరుకున్నారు. అక్కడ మత పెద్దలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేసి మరలా ర్యాలీని ప్రారంభించారు . నడిపల్లి మసీదు, గాంధీనగర్ మసీదు మీదుగా డిచ్పల్లి ఆర్య జామా మసీదు వద్ద ర్యాలీ ముగించారు. ఈ ర్యాలీ మౌలానా మొహసిన్ రజ నేతత్వంలో నిర్వహించారు. వీధులలో ర్యాలీ నిర్వహించినప్పుడు తమ వంతు అల్పాహారాన్ని యువకులు అందించి సేవా కార్యక్రమాలు చేశారు. ఈ సందర్భంగా మత గురువులు మాట్లాడుతూ మహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని ముస్లిం సోదరులు ఘనంగా నిర్వహిస్తారని తెలిపారు. మహమ్మద్ ప్రవక్త మక్కాలో పుట్టారని, అక్కడ మహిళలను హీనంగా చూసేవారని, ప్రపంచంలో మహిళలకు ప్రత్యేక స్థానాన్ని కల్పించి వారి అభ్యున్నతికి కృషిచేశారని తెలిపారు. కార్యక్రమంలో మదీనా మస్జిద్ ఇమామ్ లు ఇనాముల్ హక్ , హాష్మీ మౌలానా, పోలీస్ క్యాంప్ మసీదు ఇమామ్ ఎజాస్ అహ్మద్ ఖాన్, జామా మస్జిద్ ఇమామ్ సమీర్ అహ్మద్, గాంధీనగర్ మసీదు ఇమామ్ బిలాల్, దేవ నగర్ మసీదు ఇమామ్ యూసఫ్ రజా, మత పెద్దలు, దేవ నగర్ సర్పంచ్ యూసుఫ్, డిచ్పల్లి కోఆప్షన్ మెంబర్ నయీమ్, మైనార్టీ నాయకులు మహమ్మద్ అప్సర్ పాల్గొన్నారు.

రెంజల్:మండలంలోని వీరన్నగూడ గ్రామంలో ముస్లిం సోదరులు మిలాద్ ఉన్ నబీ పండుగ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. మహమ్మద్ ప్రవక్త పుట్టినరోజును పురస్కరించుకొని ర్యాలీ నిర్వహించే ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రెండు పండుగలు ఒకేసారి రావడంతో ఎస్సై ఉదయ్ కుమార్ ప్రతి గ్రామంలో ప్రత్యేక పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు అజ్గర అలీ, మహబూబ్, నజీర్, అప్సర్, అజ్మత్, ఇబ్రహీం, తదితరులు పాల్గొన్నారు.



డిచ్‌పల్లి : ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లిం

ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలి

చెవిలో పూలతో నిరసన



నినాదాలు చేస్తున్న ఆశావర్కర్లు

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఆశా వర్కర్లు రాష్ట్ర వ్యాప్త సమ్మెలో భాగంగా గురువారం ధర్నా చౌక్ లో నాల్గవ రోజు సమ్మె నిర్వహించి పూలు పెట్టుకొని చెవిలో నిరసనను తెలియజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఏ రమేష్ బాబు మాట్లాడుతూ.. కరోనా కష్టకాలంలో ప్రజలకు అనేక రకాల సేవలు అందించి ప్రభుత్వం ప్రజల మన్ననలు పొందిన ఆశ వర్కర్లకు మాత్రం కనీస వేతనాలు ఇవ్వకుండా మౌలిక సదుపాయాలు కల్పించకుండా నిర్లక్ష్యం చేయటం సరైనది కాదని అన్నారు. వెంటనే వారి సమస్యలను పరిష్కరించాలని కనీస వేతనం నెలకు 18 వేల రూపాయలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించి పీఎఫ్, ఈఎస్ఐ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆశా వర్కర్ల యూనియన్ నాయకులు సుకన్య, అరుణ, లావణ్య, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ఘనంగా గణేష్ నిమజ్జనం



ఆర్మూర్‌లో..

నవతెలంగాణ-విలేకరులు

రెంజల్:మండలంలో గణేష్ నిమజ్జనం ప్రశాంత వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. మండలంలోని రెంజల్, దూపల్లి, తాడి బిలోలి, సాటాపూర్, దండిగుట్ట, వీరన్న గుట్ట, గ్రామాలలో నిమజ్జన శోభాయాత్ర నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందు జాగ్రత్తగా ఎస్సై ఉదయ్ కుమార్ పర్యవేక్షణలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. వినాయక నిమజ్జనోత్సవంతోపాటు, మిలాద్ ఉన్ నబీ ముస్లింల పండుగ సందర్భంగా ప్రతి గ్రామంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. రెంజల్ సర్పంచ్ ఎమ్మెస్ రమేష్ కుమార్, దూపల్లి సర్పంచ్ శనిగరం సాయి రెడ్డి, వీరన్న గుట్ట సర్పంచ్ బైండ్ల రాజు, సాదాపూర్ సర్పంచ్ వికార్ పాషా, దండిగుట్ట సర్పంచ్ ముళ్ళపూడి శ్రీదేవి కష్టారావు పాల్గొన్నారు.

దండిగుట్ట గ్రామంలో నిర్వహించిన గణేష్ శోభాయాత్రలో మహిళలు పాల్గొని భక్తి గీతాలతో తాళం వేయడం పలువురిని ఆకర్షించింది. అనంతరం గ్రామస్తులందరికీ రామాలయంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. వేమూరి వెంకటేశ్వర్ 18 వేలకు రూపాయలు వేలం పాటలో లడ్డూను దక్కించుకున్నారు. వినాయకుడి పైన వేసిన టవల్ లుంగీలకు చుట్ట శ్రీనివాస్ వేలం పాటలో దక్కించుకున్నాడు. సర్పంచ్ ముళ్ళపూడి శ్రీదేవి కష్టారావు, ఉప సర్పంచ్ జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

నిజామాబాద్‌సిటీ :గణేష్ శోభాయాత్రలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ధన్ పాల్ సూర్యనారాయణ అనుచరులు, కార్పొరేటర్లతో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ధన్ పాల్ మాట్లాడతూ ప్రజలకు ఎటువంటి బాధలు కలగకుండా గణపయ్య కాపాడాలని కోరుకున్నారు. మార్గ మధ్యలో ధన్ పాల్ యువకులతో కలసి నూత్యాలు చేస్తూ మాహిళా సోదరిమనుల తో ఆప్యాంగా మాట్లాడతూ శోభయాత్రలో పాల్గొన్నారు. ఆయనతోపాటు స్థానిక కార్పొరేటర్ పంచరెడ్డి ప్రవళిక శ్రీధర్, అసంబ్లీ కన్వీనర్ పం,రెడ్డి లింగం, జిల్లా ఉపాధ్యక్షులు నాగోళ్ళ లక్ష్మి నారాయణ, కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

మోర్తాడ్:మండలంలో గురువారం గణేష్ శోభాయాత్ర భారీ వర్షంలోనే కొనసాగింది. గణేష్ శోభాయాత్ర ప్రారంభమైన కొద్దిసేపటికే భారీ వర్షం కురవడంతో యువజన సంఘాలు, కుల సంఘాల నాయకులు శోభాయాత్రను కొనసాగించారు.

కమ్మర్‌పల్లి:మండలంలోని ఆయా గ్రామాల్లో వినాయక నిమజ్జోత్సవాలు గురువారం కన్నుల పండుగ సాగాయి. డీజేల వద్ద యువకులు ఆనందోత్సవాలతో నత్యాలు వస్తువు ఊరేగింపు నిర్వహించారు. అనంతరం వినాయక విగ్రహాలను గ్రామ శివారులో ఉన్న చెరువుల్లో, మండల కేంద్రంలో వరద కాలంలో నిమజ్జనం చేశారు. మండల కేంద్రంలోని కషీర్ హనుమాన్ వద్ద ఏర్పాటు చేసిన మట్టి వినాయకుని మండపం వద్ద కుళాయిలు ఏర్పాటు చేసి నిమజ్జనం చేశారు. కొన్నిచోట్ల బుధవారం రాత్రి ప్రారంభమైన నిమజ్జోత్సవాలు గురువారం రాత్రి వరకు కొనసాగాయి. నిమజ్జనం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు కట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఆర్మూర్: మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి పెర్కిట్‌లలో భక్తి శ్రద్ధలతో నిమజ్జన వేడుకలు నిర్వహించారు. కాగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ జగదీష్ చందర్, స్టేషన్ హౌస్ ఆఫీసర్ సురేష్ బాబు ఆధ్వర్యంలో బందోబస్తీ ఏర్పాట్లను చేశారు. లయన్స్ క్లబ్ ఆఫ్ గ్రీన్ మాజీ జోనల్ చైర్ పర్సన్ డి .కె .రాజేష్ కుటుంబ సభ్యులతో గణేష్ నిమజ్జనం చేశారు.

ఎడపల్లి: వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా చివరి రోజు అయిన గురువారం కుర్నపల్లి, మంగళ్ పహాడ్ తానకలాన్ ,జానకంపేట ,ఎడపల్లి. తదిత గ్రామాలలో సార్వజని గణేష్ మండలి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. ఎస్సై భూపల్లి విక్రమ్‌తో పోలీస్ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు మండలంలో నిమజ్జనం చేసే ప్రదేశాల్లో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నారు. ప్రధాన వీధులలో శోభయాత్ర అనంతరం స్థానిక చెరువులలో నిమజ్జనం చేశారు. సర్పంచ్ బట్టు హనుమండ్లు, ఎంపీటీసీ అరుగుల వనజ నాగరాజు ఉపసర్పంచ్ కుంట శ్రీనివాస్, టిఆర్ఎస్ నాయలకు మాణిక్యాల సురేష్ గౌడ్, మంగల్ పాడ్ గ్రామ అభివద్ధి కమిటీ అధ్యక్షులు పెద్ద కొమర గౌడ్, కమిటీ పెద్దమనుషులు, బీఆర్ఎస్ నాయకులు మహేష్, గడ్డం గంగాధర్, సుంకరి సంజు, శ్రీనివాస్ గౌడ్. గ్రామ యువకులు పాల్గొన్నారు.



నిజామాబాద్‌సిటీ : మాట్లాడుతున్న ధన్‌పాల్ సూర్యనారాయణ



ఎడపల్లి : అన్నదానం చేస్తున్న సార్వజనిక్ గణేష్‌మండలివారు

ఎమ్మెల్సీ కవితను కలిసిన ముదిరాజ్ సంఘం



* ఎమ్మెల్సీ కవితను సన్మానిస్తున్న ముదిరాజ్ మహాసభ సభ్యులు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

తెలంగాణ ముదిరాజ్ మహాసభ నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు మెతుకు శివకుమార్ ముదిరాజ్ ఆధ్వర్యంలో తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్. బండా ప్రకాష్ ముదిరాజ్ , కల్వకుంట కవిత ఎమ్మెల్సీ ని గురువారం హైదరాబాద్ వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ముదిరాజుల సమస్యల గురించి తెలిపారు. కార్యక్రమంలో మత్సకార విభాగం అధ్యక్షులు మచ్చ శ్రీనివాస్ ముదిరాజ్, వెల్డింగ్ నారాయణ ముదిరాజ్, సంగమేశ్వర్ ముదిరాజ్, ఉపాధ్యక్షులు తొక్కిడి సంతోష్ ముదిరాజ్, శ్రీనివాస్ ముదిరాజ్, సత్యనారాయణ ముదిరాజ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ పిట్టల భూమయ్య ముదిరాజ్, ముదిరాజ్ మీడియా అధ్యక్షులు సతీష్ ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు.

నీలా మాజీ సర్పంచ్ కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని నీల గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ లోకం లింబాద్రి అనారోగ్యంతో మతి చెందగా ఆయన కుటుంబీకులను బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేడపాటి ప్రకాశ్ రెడ్డి గురువారం పరామర్శించారు. లింబాద్రి కుటుంబానికి తమ సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని ఆయన పేర్కొన్నారు. లింబాద్రి నీల సర్పంచిగా తన సొంత నిధులతో అభివద్ధి కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు గోపికష్ణ, బిజెపి మండల మాజీ అధ్యక్షులు మేక సంతోష్, మండల ఉపాధ్యక్షులు యోగేష్, ఉప సర్పంచ్ నాగభూషణం, మండల బిజెపి నాయకులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
3
కామారెడ్డి
శుక్రవారం | సెప్టెంబర్ 29, 2023 | www.navatelangana.com

బీఆర్ఎస్‌లో పలువురి చేరికలు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం తాడ్వాయి మండల బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన బీజేపీ కార్యకర్తలు ఎమ్మెల్యే జాజాల సురేందర్ ఆధ్వర్యంలో భారీగా బిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా తాడ్వాయి మండల బ్రాహ్మణపల్లి బీజేపీ నాయకులు మాట్లాడుతూ ఎమ్మెల్యే జాజాల సురేందర్ చేస్తున్న అభివృద్ధి పనులను చూసి పార్టీలో చేరినట్లు తెలిపారు. వీరికి ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, జెడ్పీటీసీ రమాదేవి నారాయణ, డీసీఎంఎస్ డైరెక్టర్ కపిల్ రెడ్డి, సొసైటీ వైస్ చైర్మన్ ధర్మా రెడ్డి, సర్పంచ్ రాజయ్య, ఉప సర్పంచ్ అహ్మద్, బోగ మనోహర్, మేరీ సాయికుమార్, బోగ ప్రవీణ్, పెడకుల రాజేష్, కుర్మ బాబు, కుర్మ మల్లేష్, గాండ్ల రాజు, ప్రసాద్ గౌడ్, నవీన్ గౌడ్, శ్రావణ్, బీరయ్య, రాఘవ చారి ,ఓంకార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మద్నూర్ సింగిల్ విండో 53వ మహాజనసభ

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ సింగల్ విండో 53వ మహాజన సభ సంఘం భవనంలో విండో చైర్మన్ శ్రీనివాస్ పటేల్ అధ్యక్షతన నేడు (శుక్రవారం) ఉదయం 11:30 నిమిషాలకు నిర్వహించనున్నట్లు సింగిల్ విండో కార్యనిర్వహణ అధికారి జే బాబురావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మహాజన సభ విజయవంతానికి సంఘం పరిధిలోని సభ్యులందరూ పెద్ద సంఖ్యలో హాజరుకావాలని ఆయన కోరారు. ఈ మహాజన సభ సమావేశంలో 1-4-2023 నుండి 29-9-2023 వరకు జమ ఖర్చుల ఆమోదం ఇతర అంశములు అధ్యక్షుల అనుమతితో చర్చించుకోనున్నట్లు తెలిపారు. సభ్యులందరూ సకాలంలో హాజరై మహాజనసభ విజయవంతం చేయాలని కార్యనిర్వాహణ అధికారి విజ్ఞప్తి చేశారు.

మైనార్టీ మహిళలు ఆర్థిక స్వావలంభన సాధించాలి

- ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్

నవతెలంగాణ-కామారెడ్డి(తాడ్వాయి)

మైనార్టీ మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలని ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ అన్నారు. కామారెడ్డి పట్టణంలోని సత్య గార్డెన్ లో గురువారం జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ సహకారంతో మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ముఖ్యమంత్రి కేసీఆర్ మైనార్టీ మహిళలు భర్తకు చేదోడు వాదోడుగా ఆర్థికంగా ఎదగాలనే లక్ష్యంతో భరోసా పథకం కింద కుట్టుమిషన్లను ఇస్తున్నారని తెలిపారు. మహిళలకు ఉపాధి లభిస్తుందన్నారు. మైనారిటీలు అన్ని వర్గాల ప్రజలతో చదువులో రాణించాలని మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్స్, జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేశారని చెప్పారు. వీటి ద్వారా మైనార్టీ విద్యార్థులకు ఇంగ్లీష్ మీడియంలో నాణ్యమైన విద్యను అందిస్తున్నామని తెలిపారు. ప్రతి విద్యార్థిపై ఏడాదికి రూ.1.25 లక్షలు ఖర్చు చేసి పౌష్టికాహారం, దుస్తులు ప్రభుత్వం ఇస్తుందని తెలిపారు. పేద మైనార్టీ విద్యార్థులు విదేశాల్లో చదువుకోవడానికి రూ. 20 లక్షలు ప్రభుత్వం ఇస్తుందని చెప్పారు. మైనార్టీ యువతులకు షాదీ ముబారక్ పథకం కింద ప్రభుత్వం రూ.1,116 ఆర్థిక సాయం అందజేస్తుందని పేర్కొన్నారు. కామారెడ్డి నియోజకవర్గంలోని మసీదులు, ఈద్గాల అభివృద్ధికి రూ. కోటి పది లక్షల రూపాయలు వెచ్చించినట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడారు. మహిళలు కుట్టు మిషన్ల ద్వారా స్వయం ఉపాధి పొంది ఆర్థికంగా ఎదగాలని సూచించారు. ప్రభుత్వం ఇచ్చిన అవకాశాన్ని వినియోగించు కోవాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర మైనారిటీ కార్పొరేషన్ ఫైనాన్స్ చైర్మన్ ఇంతియాజ్ ఇసాక్, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ ముజీబుద్దీన్, జెడ్పీ వైస్ చైర్మన్ ప్రేమ్ కుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ ఇందుప్రియా, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి దయానంద్, ఎంపీపీలు, జడ్పిటిసి సభ్యులు, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.



కుట్టుమిషిన్‌లు పంపిణీ చేస్తున్న విప్, కలెక్టర్ తదితరులు

భగత్ సింగ్ జయంతి వేడుకలు



నివాళి అర్పిస్తున్న నాయకులు

నవతెలంగాణ-బిచ్కుంద

భగత్ సింగ్ జయంతి సందర్భంగా భారతీయ జనతా పార్టీ యువమోర్చా ఆధ్వర్యంలో జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని బిజెపి కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి దేశ స్వాతంత్రం కోసం భగత్ సింగ్ చేసిన త్యాగాన్ని కొనియాడారు. బీజేవైఎం మండల అధ్యక్షులు శెట్టిపల్లి విష్ణు మాట్లాడుతూ 23 ఏళ్ల వయసులోనే భగత్ సింగ్ దేశ స్వాతంత్రం కోసం పోరాట స్ఫూర్తిని కనబరిచి త్యాగానికి దేశభక్తి అసలైన నిర్వచనం అని 23 ఏళ్ల వయసులోనే మహా యోధుడిని అప్పటి ఆంగ్లేయులు ఉరితీసారన్నారు. భగత్ సింగ్ చేసిన త్యాగానికి దేశ ప్రజలు ఎప్పుడు మర్చిపోలేరని అన్నారు. ఈ కార్యక్రమంలో గణపతి, మల్లికార్జున్ దేశాయ్, గోపాల్ చారి, దన్నూరు విఠల్, రాము, శంకర్ పటేల్ ఉన్నారు.

ప్రతి వార్డులో స్వచ్ఛత సేవా

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని పురపాలక సంఘంలో పురపాలక కమిషనర్ జీవన్ కుమార్, చైర్మన్ కుడుముల సత్యనారాయణ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ హైదారాబాద్ ఆదేశాల మేరకు గురు వారం స్వచ్ఛత ఈసేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పురపాలక సంఘం పరిధిలోని 12 వార్డులలో ప్రస్తుత సీజనల్ వ్యాదుల పట్ల ఎల్లారెడ్డి పట్టణ ప్రజలు తమ పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఆయా వార్డులలోకి వెళ్లి స్వచ్ఛత కార్యక్రమాలు చేపట్టారు. స్వచ్ఛత ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అన్నీ వార్డుల కౌన్సిల్ సభ్యులు కొ-అప్షన్ సభ్యులు అధికారులు పురపాలక సిబ్బంది ఆయా వార్డులలోని ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

నవతెలంగాణ-భిక్కనూర్



రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మరణించిన ఘటన మండలంలోని 44వ జాతీయ రహదారిపై గురువారం స్థానిక ఎడ్ల కట్ట వాగు సమీపంలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జంగంపల్లి గ్రామానికి చెందిన రాజయ్య (52) భిక్కనూరు నుండి తన వ్యక్తిగత పనులు ముగించుకొని ఇంటికి వెళ్తుండగా ఎడ్ల కట్ట వాగుకు చేరుకోగానే ద్విచక్ర వాహనం అదుపుతప్పి కింద పడిపోవడంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మరణించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయి కుమార్ తెలిపారు.

మహారాష్ట్రలో రైలుకింద పడి మాచారెడ్డివాసి మృతి

నవతెలంగాణ-మాచారెడ్డి



మృతిచెందిన చంద్రం

మాచారెడ్డి మండల కేంద్రానికి చెందిన గంగుల చంద్రం(28) మహారాష్ట్రలో రైలు కిందపడి మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మృతిని వద్ద దొరికిన ఆధార్ కార్డు ఆధారంగా మహారాష్ట్ర రైల్వే పోలీసులు మూడు రోజుల తర్వాత శవాన్ని మండల కేంద్రానికి పంపించారు. కాగా మృతిని తండ్రి నరసయ్య అంత్రక్రియలకు నిరాకరించడంతో గ్రామస్తులు చందాలు వేసుకొని గురువారం అంత్యక్రియలు నిర్వహించారు.

ఎమ్మెల్యే సహకారంతో గ్రామాల అభివృద్ధి



బోరుమోటారు ఏర్పాటు

నవతెలంగాణ-భిక్కనూర్

కామారెడ్డి నియోజకవర్గ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ సహకారంతో గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని భిక్కనూరు మండలం కంచర్ల గ్రామ సర్పంచ్ చంద్రకళ మాధవరెడ్డి తెలిపారు. గురువారం గ్రామంలో మాల పోచమ్మ ఆలయం వద్ద ప్రభుత్వ విప్ సహకారంతో వేసిన బోరులో మోటార్‌ను బిగించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్, బిఆర్ఎస్ గ్రామ అధ్యక్షులు రమేష్, మాల సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా మిలాద్ ఉన్ నబి

నవతెలంగాణ-జుక్కల్

మండల కేంద్రంలో జాసనే ఈద్ మిలాద్ ఉన్ నబి సల్లేల్ల అలైయ్ హి వా సల్లాం జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. జుక్కల్ మండల కేంద్రంలోని జామీయా మజీద్ నుండి అంబేద్కర్ చౌరస్తా మీదుగా ఖతీయా మజీద్ వరకు శోభయాత్ర నిర్వహించారు. అనంతరం ముస్లింలు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ముస్లిం పెద్దలు అలీమ్, అబ్దుల్ సుభాన్ మాట్లాడుతూ అందరిలో సమానత్వం, సౌభ్రాతృత్వం అనాథ పిల్లలను ఆదుకోవడం, తల్లిదండ్రులకు గౌరవించడం వలన జన్మ సార్థకం అవుతుందని మహ్మద్ ప్రవక్త ప్రవచించారని తెలిపారు. కార్యక్రమంలో మతపెద్దలు ఎస్డీ షకీల్, ఎస్డీ కరీం, షేక్ ఫిర్దోస్ , ఖాజా, మైబుబ్, అజయ్, ఫరూక్,జమీర్ తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

మెప్మా లో పనిచేస్తున్న ఉద్యోగులను పని వేతనాన్ని గతంలో 4000 రూపాయలు ఇచ్చే వారని ఈ సందర్భంగా వారికి అదనంగా 2000 కలిపి 6000 రూపాయల వేతనాన్ని పెంచడంతో మెప్మా సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. అందులో భాగంగా ఎల్లారెడ్డి పురపాలక సంఘం లో పనిచేసే మెప్మా ఉద్యోగులు మంత్రి కేటీఆర్ చిత్రపటానికి గురువారం ఉదయం మెప్మా ఆర్పి సోని కిరణ్ చేతుల మీదుగా పాలాభిషేకం చేశారు. అనంతరం సోనీ కిరణ్ మాట్లాడుతూ తక్కువ వేతనంతో పని చేసే మెప్మా సిబ్బంది పనిని గుర్తించిన మంత్రి కే తారక రామారావు వేతనం పెంచడంతో చాలా సంతోషంగా ఉందని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మెప్మా ఆర్పీలు అమృత, స్వర్ణలత, రేఖ, సవిత, స్వప్న, అంజయ్య, కిరణ్, అనసూయ, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

చెరువు వద్ద భారీ బందోబస్తు

నవతెలంగాణ-మద్నూర్



బందోబస్తు పర్యవేక్షిస్తున్న పోలీసులు

మద్నూర్ మండల కేంద్రంలో గణేష్ నిమజ్జనం గురువారం నాడు నిర్వహించారు. మండల కేంద్రమైనందున దాదాపు 50 వరకు గణేష్ మండలి ఏర్పాటు కావడంతో నిమజ్జనం చేసే మైసమ్మ చెరువు వద్ద భారీ ఏర్పాట్లు చేశారు. పోలీస్ బందోబస్తు నిర్వహించారు. ఏర్పాట్లను ఎప్పటికప్పుడు గ్రామ సర్పంచ్ సురేష్ గ్రామ కార్యదర్శి సందీప్ సమీక్షించారు. గణేష్ విగ్రహాలు పెద్ద పెద్దగా ఏర్పాటు చేయడంతో నిమజ్జనానికి క్రేన్ల సౌకర్యం ఏర్పాటు చేశారు. నిమజ్జను చెరువు వద్ద పోలీస్ శాఖ ఫైర్ శాఖ వివిధ శాఖల అధికారులు బందోబస్తు చేశారు. లైట్లు ఏర్పాటు చేయడంతో నిమజ్జన కార్యక్రమానికి మంచి సౌకర్యాలు కల్పించిన గ్రామ సర్పంచ్ కు గ్రామ కార్యదర్శ కి గ్రామస్తులు అభినందించారు.

మద్నూర్‌కు మళ్లీ మొండిచేయే

- మరో మండలానికి తరలిన వందపడకల ఆస్పత్రి
- గతంలో ఇచ్చిన హామీ మేరకు ఇక్కడ కూడా ఏర్పాటు చేయాలని మద్నూర్ వాసుల డిమాండ్

నవతెలంగాణ-మద్నూర్

పాత తాలూకా కేంద్రమైన మద్నూర్ నుంచి డివిజన్ స్థాయి కార్యాలయాలు తరలుతున్న వేళ.. తాజాగా మద్నూర్‌లో ఏర్పాటు చేయాల్సిన వంద పడకల ఆస్పత్రి సైతం మరో మండలానికి తరలిపోయిందని మద్నూర్ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మారుమూల మండలంలో వైద్య సదుపాయాలు మరింత మెరుగుపరచాల్సింది పోయి.. ఇతర మండలాలకు తరలించడం సరికాదని వాపోతున్నారు. మద్నూర్‌లో సైతం వంద పడకల ఆస్పత్రి ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. మద్నూర్.. మహారాష్ట్రకు సరిహద్దులో ఉన్న మారుమూల మండలం. ఇక్కడ సౌకర్యాలు అంతంతే. ఇలాంటి ప్రాంతం అభివృద్ధి చేయాల్సి ఉండగా.. కానీ ఇక్కడికి రావాల్సిన సౌకర్యాలు తరలిపోతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మద్నూర్ పాత తాలూకా కేంద్రం అసెంబ్లీ ఎన్నికలు జరగాలంటే మద్నూర్ తాసిల్దార్ కార్యాలయంలోనే నామినేషన్లు వేస్తారు. అంతటి ప్రాధాన్యత కలిగిన మద్నూర్ మండలం పట్ల పాలకులు చిన్నచూపు చూస్తున్నారని మద్నూర్ వాసులు ఆరోపిస్తున్నారు. ప్రతిసారి ఎన్నికల ముందు వందల పడకల ఆసుపత్రి మద్నూర్‌కే మంజూరు చేస్తామని హామీలు వచ్చినా.. చివరికి మంజూరైన ఆస్పత్రిని మరో మండలానికి తరలించడం చర్చనీయాంశమైంది. మద్నూర్‌కు సైతం మరో 100 పడకల ఆస్పత్రిని మంజూరు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. జిల్లాలో ఎక్కడలేని ప్రభుత్వాసుపత్రికి స్థలం మద్నూర్ ప్రభుత్వ ఆస్పత్రికి ఐదు ఎకరాలకు పైగా స్థలం ఉన్నప్పటికీ 100 పడకల ఆసుపత్రి మంజూరు చేయడంలో సవతితల్లి ప్రేమ చూపిస్తున్నారని వాపోతున్నారు. మద్నూర్ మండలాన్ని పూర్తిగా విస్మరిస్తున్నారని, ఇప్పటికే ఉన్న ప్రభుత్వ కార్యాలయాలను తరలిస్తారనే దానిపై మండల ప్రజల్లో రకరకాల చర్చలు వినబడుతున్నాయి. ఇప్పటికైనా పాలకులు స్పందించి మద్నూర్ అభివృద్ధికి కృషి చేయాలని మండల వాసులు కోరుతున్నారు.

షాదీఖానాకు 50లక్షల నిధులు మంజూరు

నవతెలంగాణ-బిచ్కుంద

బిచ్కుంద మండల కేంద్రంలో ఉన్న పాత షాది ఖానా స్థలంలో నూతన షాది ఖానా నిర్మాణం కొరకు 50లక్షల నిధులు మంజూరు అయ్యాయని మండల కో ఆప్షన్ సభ్యులు జావిద్ సిద్దికి తెలిపారు. మండల కేంద్రంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో విలేకరులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2001 సంవత్సరంలో నిర్మించిన షాదీఖానా శిథిలావస్థకు చేరుకోవడంతో నూతన షాది ఖానా కోసం గతంలో పంపిన ప్రపోజల్స్ పెండింగ్లో ఉండడంతో ఈ విషయం ఎమ్మెల్యే హనుమంత్ షిండే దృష్టికి తీసుకెళ్లగా ప్రత్యేకంగా చొరవ తీసుకొని ముఖ్యమంత్రి కెసిఆర్ దృష్టికి తీసుకెళ్లి మైనారిటీ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ నుండి ప్రత్యేక నిధులను జీవో నెంబర్ 442 తేదీ 27/9/2023 ద్వారా మంజూరు చేయించినట్లు తెలిఆరు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్ ఎమ్మెల్యే హనుమంత్ షిండే కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం మాజీ కోఆప్షన్ సభ్యులు బాబా మాట్లాడుతూ గతంలో పాలించిన పాలకులు మైనారిటీల పట్ల చిన్నచూపు చూసేవారని అరకొరా సంక్షేమ పథకాలు అమలు చేసి మైనారిటీలకు అన్యాయం చేశారన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ మైనారిటీలకు షాది ముబారక్, రైతుబంధు, రైతుబీమా తదితర సంక్షేమ పథకాలు అమలు చేసి విద్యారంగంలో మైనారిటీలు వెనుకబడి ఉన్నారని గమనించి మైనారిటీ గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేసి ఉచితంగా విద్యా, భోజన వసతి కల్పించి మైనార్టీల విద్య అభివృద్ధికి కృషి చేశారన్నారు. జుక్కల్ నియోజకవర్గంలో మైనారిటీలకు సంక్షేమ పథకాలు అందజేసి మైనారిటీల అభివృద్ధికి జుక్కల్ ఎమ్మెల్యే హనుమంత్ షిండే కృషి ఎంతో ఉందని అన్నారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీహరిరాజు, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు వెంకటరావు దేశాయ్, రైతు సహకార సంఘం అధ్యక్షులు శ్రీహరిబాలాజీ, నాయకులు బొమ్మలలక్ష్మణ్, మైనారిటీ నాయకులు అబ్రార్ అలీ, తౌఫిక్ అలి, షాకీబ్ ఖాన్, ముజీబ్, ముఖీద్ ఉన్నారు.

ఆశాలకు ఉద్యోగ భద్రత కల్పించాలి

నవతెలంగాణ-తాడ్వాయి

ఉద్యోగ భద్రత కల్పించాలని, ఫిక్స్‌డ్ వేతనం చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఆశాలు తాడ్వాయి మండలంలోని ఎర్ర పహాడ్ ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట ఆశా వర్కర్‌లు నిరసన వ్యక్తం చేశారు. సమ్మెలో భాగంగా గురువారం నాలుగవ రోజుల నిరసన ప్రదర్శన చేపట్టారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఆశాలకు ఇస్తున్న పారితోషికాలను 18 వేల ఫిక్స్ జీతం ఇవ్వాలని అలాగే ఆశాలకు పిఎఫ్, ఈ ఏ ఎస్ ఐ సౌకర్యం ఉద్యోగ భద్రత కల్పించాలని ఆరోగ్య భద్రతా కార్డులు ఇవ్వాలని ప్రమాద బీమా సౌకర్యం వర్తింపజేయాలని ఏఎన్ఎం, జి ఏ ఎన్ ఎం పోస్టులు ఆశాలకు ప్రమోషన్స్ సౌకర్యం కల్పించాలని తెలిపారు. పారితోషికం లేని పనులు ఆశాలతో చేయించవద్దని, పని వారం తగ్గించి జాబ్ చార్ట్ నిర్ణయించాలని, 32 రకాల రిజిస్టర్స్ వెంటనే ప్రింట్ చేసి ప్రభుత్వం సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.



పారిశుధ్య పనుల పరిశీలన

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

స్వచ్ఛత ఈ సేవా కార్యక్రమంలో భాగంగా పురపాలక సంఘం పరిధిలోని 10వ వార్డులో జరుగుతున్న పారిశుధ్య పనులను గురువారం రోజున స్థానిక పురపాలిక కౌన్సిలర్ పద్మ శ్రీకాంత్ పరిశీలించారు. వార్డులో జరుగుతున్న పారిశుధ్య పనులను ఆయన కాలనీలో తిరుగుతూ కాలనీ వాసుల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10వ వార్డులో సానిటేషన్, మంచినీటి సరఫరా, ఇతర సమస్యలు ఏవైనా ఉంటే వెనువెంటనే పరిష్కారం చేస్తున్నామని, ప్రస్తుత సీజనల్ వ్యాదుల పట్ల కాలనీలోని ప్రజలు తమ పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని అవగాహన కల్పించారు. కాలనీలో ఉన్న అన్ని మురికి కాలువలు శుభ్రం చేయిస్తున్నామని, బ్లీచింగ్ పౌడర్ చల్లిచటం లాంటి పనులను చేపడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో కాలనీ వాసులు మంద్రు నారాయణ, నాయిని శ్రీరాములు, అంజయ్య, అవుసుల రమాదేవి, పోతుల గంగమ్మ, శ్రీనివాసులు, విజయ్, చక్రపాణి, సంతోష్, వెంకట్రాములు, అమృత, కాశీరాములు తదితరులు ఉన్నారు.



పనులు పరిశీలిస్తున్న కార్పోరేటర్

18వ రోజుకు అంగన్‌వాడీల సమ్మె

నవతెలంగాణ-పిట్లం

కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె గురువారంతో 18వ రోజుకు చేరుకుంది. పిట్లం మండల పరిషత్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీల నిరసన కొనసాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీ ఉద్యోగుల పట్ల ప్రభుత్వం స్పందన కొరబడిందన్నారు. ప్రభుత్వము తక్షణమే అంగన్వాడీ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసి 26 వేల రూపాయలను కనీస వేతనముగా ప్రకటించాలని, రిటైర్డ్ మెంట్ ప్రకటించాలని కోరారు. లేనిపక్షంలో ప్రభుత్వం ఇదే పంత కొనసాగిస్తే సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అక్టోబర్ 1న రాస్తారోకో , 2న గాంధీ విగ్రహానికి వినతి, 3న, 4న తేదీలలో పాదయాత్ర ప్రాజెక్టు కేంద్రాల నుండి ప్రారంభించి జిల్లా కేంద్రం లోని కలెక్టరేట్ చేరుకుంటామని, అక్టోబర్ 10 న చలో అసెంబ్లీ హైదరాబాద్ ముట్టడిస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కుమ్మరి రాధా , అన్నారం అనురాధ , జంగం సుమలత , కరేగాం అనురాధ , సుజాత , జగదీశ్వరి , గౌరవ్వ , పార్వతి , అయా లు తదితరులు పాల్గొన్నారు.



సమ్మె శిబిరంలో కూర్చున్న అంగన్‌వాడీలు

నిమజ్జన శోభ




లింగంపేట్‌లో..

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ మండల కేంద్రంలో గురువారం వినాయకుని శోభయాత్ర రంగ రంగ వైభవంగా కొనసాగుతుంది. యువతి యువకులు పోటాపోటీగా బ్యాండ్ సప్పుడుల మధ్య నృత్యాలు చేస్తున్నారు. బుధవారం రాత్రి మండపాల నిర్వాహకులు ట్రాక్టర్లను అలంకరించి వినాయకుల విగ్రహం పెట్టారు బుధవారం రాత్రి మొదలైన శోభయాత్ర మండల కేంద్రంలోని ప్రధాన వీధుల గుండా శోభయాత్ర కొనసాగుతోంది. మండల కేంద్రంలో యువజన సంఘాల ఆధ్వర్యంలో 27 వినాయక విగ్రహాలను ప్రతిష్టించారు. రాత్రి సమయం కావడంతో విద్యుత్ దీపాలు పెట్టారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా లింగంపేట్ ఎస్సై ప్రభాకర్ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు శోభయాత్ర కొనసాగుతుంది.

సదాశివనగర్: మండలంలోని పలుగ్రామలలో గురువారం గణపతుల శోభయాత్ర నిర్వహించారు. డిజే పాటలతో నృత్యాలతో శోభయాత్రలు నిర్వహించారు. ప్రదాన వీధుల గుండా కొనసాగింది. అనంతరం గ్రామ శివారులో ని. చెరువు. కుంటలలో గణేష్ లను నిర్వహించారు. మండలం లోని దగ్గి , తుక్కోజివాడి, తిమ్మోజివాడి తదితర గ్రామాల్లో గణపతుల నిమజ్జనం చేశారు.



సదాశివనగర్‌లో..

సొంత గూటికి ఎల్లారం సర్పంచ్

నవతెలంగాణ-లింగంపేట్

ఇటీవల మదన్‌మోహన్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎల్లారం సర్పంచ్ మల్లయ్య.. గురువారం ఎమ్మెల్యే సమక్షంలో తిరిగి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. సందర్భంగా సర్పంచ్ ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు ప్రజలకు చేరేలా తన వంతు బాధ్యత వహిస్తానన్నారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమేష్, డిసిఎంఎస్ డైరెక్టర్ కపిల్ రెడ్డి,శ్రీను నాయక్ దాసరి పరువయ్య తదితరులు ఉన్నారు.

తెలంగాణ ప్రజల సంక్షేమమే కేసిఆర్ అజెండా

- రాష్ట్ర మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి

నవతెలంగాణ-వేల్పూర్ (కమ్మర్‌పల్లి)

కేసిఆర్ జనరంజక పాలన,బాల్కొండ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధికి ఆకర్షితులై ఏర్గట్ల మండలం బట్టాపూర్ గ్రామానికి చెందిన రాక్ స్టార్ యూత్ సభ్యులు 30 మంది, బంజారా యూత్ సభ్యులు 20 మంది రాష్ట్ర రోడ్లు భవనాలు శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి సమక్షంలో గురువారం బిఆర్ఎస్ పార్టీలో చేరారు. వేల్పూర్‌లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో వారికి గులాబీ కండువా కప్పి మంత్రి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు పూర్ణానందం, మండల పార్టీ నాయకులు,గ్రామ సర్పంచ్, బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చూడాలి

- నిజామాబాద్ సీపీ

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ పోలీస్ కమిషనర్ వి. సత్యనారాయణ, వైశ్య భవన్, నాగేశ్వర దేవాలయం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీ వైశ్య రత్న గణేష్ మండలిని గురువారం దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సత్యనారాయణ మాట్లాడుతూ.. వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా వారికి ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపి అభినందించారు. అనంతరం సార్వజనిక్, రాజస్థాన్ భవన్, కొన్ని గణేష్ మండలి వారు నిమజ్జనం సందర్భంగా తీసుకుంటున్న జాగ్రత్తలు ఏర్పాట్ల గురించి అడిగి తెలుసుకొన్నారు. ప్రజలకు ఎక్కడ ఎలాంటి అసౌకర్యం లేకుండా, ఇబ్బందులు లేకుండా చూడాలని అన్నారు. కార్యక్రమంలో ఏసీపీ కిరణ్ కుమార్, టౌన్ సీఐ నరహరి, ఎస్‌హెచ్ఓ విజయ్ బాబు, ట్రాఫిక్ సీఐ చందర్ రాథోడ్, ఎస్ఐలు గణేష్ మండలి నిర్వాహకులు పాల్గొన్నారు.

మంత్రి ప్రశాంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

బాల్కొండ నియోజకవర్గం లోని రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలం మానాల గిరిజన తండాల్లో గురువారం రాష్ట్ర రోడ్లు భవనాలు, గృహ నిర్మాణ, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. గిరిజనుల ఆరాధ్య దైవమైన శ్రీ సంత్ సేవలాల్ మహారాజ్ తీజ్ ఆలయం, భవనం నిర్మాణం కోసం రూ.67 లక్షలు మంజూరు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి చిత్రపటానికి బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు దేగావత్ తిరుపతి ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రుద్రంగి ఎంపిపి అధ్యక్షురాలు గంగం స్వరూప మహేష్, వైస్ ఎంపిపి పిసరి భూమయ్య పాల్గొని మాట్లాడారు. ఉమ్మడి మానాల పరిధిలోని 8 గ్రామ పంచాయతీలోని 16 తాండలకు కలిపి సేవాలాల్ మహారాజ్ ఆలయాల నిర్మాణం కోసం రూ.67 లక్షలు మంజూరు సంతోషకరమన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి మానాల సర్పంచ్‌లు, ఉప సర్పంచ్ లు, గ్రామ శాఖ అధ్యక్షులు, ముఖ్య నాయకులు, గిరిజన తండా పెద్ద మనసులు, గిరిజనలు, తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు పంపిణీ

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే గణేష్ బిగాల 29 మందికి 13,32,900రూపాయల సీఎంఆర్ఎఫ్ చెక్కులను గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గణేష్ బిగాల మాట్లాడుతూ.. సీఎంఆర్ఎఫ్ తో మెరుగైన వైద్యం అందుతుందని తెలిపారు.కార్యక్రమంలో మేయర్ దండు నీతుకిరణ్, మాజీ మేయర్ ఆకుల సుజాత బి ఆర్ ఎస్ నాయకులు సుజీత్ సింగ్ ఠాకూర్,సూదం రవి చందర్ ,సత్య ప్రకాశ్,సిర్ప రాజు,ధర్మ పూరి, రాజేంద్ర ప్రసాద్ మరియు నాయకులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

నవతెలంగాణ-కంఠేశ్వర్

పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ లో విధులు నిర్వహిస్తున్న రిసోర్స్ పర్సన్‌కు రూ.2వేల వేతనం పెంచినందున ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్ర పటానికి గురువారం నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆర్‌పిలు పాలాభిషేకం నిర్వహించారు. అసెంబ్లీ సమావేశాల్లో ఆర్‌పి ల సమస్యలు పరిష్కరించాలని, వేతనం పెంచాలని ఎమ్మెల్యే గణేష్ బిగాల ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారని తెలిపారు. వేతనాలు పెంపునకు కృషి చేసిన ఎమ్మెల్యే గణేష్ బిగాలకు ఆర్‌పిలు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నగర మేయర్ దండు నీతు కిరణ్, మాజీ మేయర్ ఆకుల సుజాత, బీఆర్ఎస్ కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ఇంటర్ స్టేట్ కరాటే ఛాంపియన్ షిప్ విజేతలు

అంతరాష్ట్ర కరాటే ఛాంపియన్ షిప్‌లో విజయం సాధించిన క్రీడాకారులు నిజామాబాద్ జిల్లా స్పోర్ట్స్ కరాటే అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ ఎడ్ల వెంకటేష్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే గణేష్ బిగాలని గురువారం క్యాంపు కార్యాలయంలో కలిశారు. అంతరాష్ట్ర కరాటే పోటీల్లో పతకాలను సాధించిన విద్యార్థులను ఎమ్మెల్యే గణేష్ బిగాల అభినందించారు. భవిష్యత్ లో అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటాలని సూచించారు. కార్యక్రమంలో నగర మేయర్ దండు నీతు కిరణ్ , మాజీ మేయర్ ఆకుల సుజాత, మెడల్స్ సాధించిన వారిలో వారు పాల్గొన్నారు.

పక్కా భవనాలకు ప్రతి పంచాయతీకి 20 లక్షలు మంజూరు

- భూమిపూజ చేసిన ఎంపీపీ



పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ

నవతెలంగాణ-ధర్పల్లి

మండలంలోని కొత్తగా ఏర్పడ్డ 9 గ్రామపంచాయతీలకు పక్క భవనాల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసినట్లు ఎంపీపీ నల్ల సారిక హన్మంత్ రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని సీతాయిపేట్ గుడి తండా నూతన పంచాయతికి 20 లక్షలతో చేపడుతున్న భావన నిర్మాణానికి ఆమె భూమి పూజ చేశారు. ఈసందర్భంగా ఆమె మట్లాడుతూ.. రూరల్ ఎమ్మెల్యే గోవర్ధన్, జెడ్పిటిసి జగన్ సహకారంతో మండలంలోని తొమ్మిది నూతన గ్రామ పంచాయతీలకు 20 లక్షల చొప్పున నిధులు మంజూరయ్యాయని అన్నారు. గుడి తండా ప్రయిమరీ పాఠశాల పహారి గోడకు 20 లక్షలతో పనులు చేయడం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ లింబియా నాయక్, ఎంపిటిసి, ఎంపిడిఓ లక్ష్మణ్, డైరెక్టర్లు శ్రీనివాస్ నాయక్, విట్టల్ నాయక్, నాయకులు గోపాల్ నాయక్ పాల్గొన్నారు.

జిల్లా సీనియర్ పురుషుల సాఫ్ట్ బాల్ ప్రాబబుల్స్ జట్ల ఎంపిక

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని సాంఘిక సంక్షేమ బాలుర పాఠశాల క్రీడామైదానంలో గురువారం జిల్లా సీనియర్ పురుషుల సాఫ్ట్ బాల్ ఎంపికలో 25 మందితో ప్రాబబుల్స్ జట్టును ఎంపిక చేసినట్లు జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు వి ప్రభాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మర్కంటి గంగా మోహన్ తెలిపారు. ఎంపికైన జట్టుకు శిక్షణ శిబిరం నిర్వహించి అక్టోబర్ రెండో వారంలో జరిగే రాష్ట్ర సీనియర్ సాఫ్ట్ బాల్ పోటీలకు తుది జట్టును ఎంపిక చేసి పంపుతామన్నారు.ఎంపిక కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టి టి యు అధ్యక్షులు పెంట జలంధర్ ఎంపికను ప్రారంభించారు. రాష్ట్ర పోటీలలో చక్కని ప్రతిభ కనబరిచి నవంబర్ నెలలో జమ్మూ కాశ్మీర్ లో జరిగే జాతీయ పోటీలో జిల్లా నుంచి ఎక్కువ మంది క్రీడాకారులు ఎంపిక కావాలని అన్నారు. పాఠశాల ప్రిన్సిపల్ దుర్గా రెడ్డి మాట్లాడుతూ క్రీడాకారులకు ప్రభుత్వ ఉద్యోగాల్లో రెండు రిజర్వేషన్ కల్పిస్తుందన్నారు. ఉన్నత విద్యలో కూడా క్రీడాకారులకు రిజర్వేషన్ ఉన్నందున క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఖో ఖో అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి మీసాల సుజాత, కామారెడ్డి డిగ్రీ కాలేజ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆరే రాజేందర్, పిఆర్టియు జిల్లా నాయకురాలు సంధ్యారాణి, వ్యాయామ ఉపాధ్యాయులు, సాఫ్ట్ బాల్ అకాడమీ కోచ్ ఈ. నరేష్ సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

ఐదురోజులు బాలాజీ జెండా ఉత్సవాలు

- వెల్మల్ నుంచి తిరుపతికి తరలింపు
- నేడు జెండా ఊరేగింపు అనంతరం జిల్లాకేంద్రానికి చేరిక

నవతెలంగాణ-నందిపేట్

గోవిందా .. గోవిందా.. వెంకటరమణ గోవిందా.. అంటూ భక్తుల నామస్మరణతో ఐదు రోజులపాటు వెల్మల్‌లో జెండా ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. జెండా వద్ద భక్తులు పూజలు చేసి మొక్కులు మొక్కుకుంటారు. కిలోల కొద్ది చక్కెరను ప్రసాదంగా పంచుతారు. ఇది గత కొన్ని సంవత్సరాలుగా వస్తున్న ఆనవాయితీ. బాలాజీ జెండాకు పూజలు చేస్తే మంచి జరుగుతుందని గ్రామస్తుల నమ్మకం.

ఇదీ చరిత్ర.....

మండలంలోని వెల్మల్ గ్రామంలో తరతరాల నుంచి బాలాజీ జెండా ఉత్సవాలను జరిపిస్తున్నారు. గతంలో అయ్యవార్లు ఈ వేడుకలను చేపట్టేవారు. దీంతో ఆనాటి నుంచి పెద్ద ఎత్తున ఉత్సవాలను కొనసాగిస్తున్నారు.



జెండా బాలాజీ ఆలయం

పూర్వీకులు కొన్నేళ్లుగా కాలిబాటన తిరుపతికి వెళ్లినట్లు పెద్దలు చెబుతున్నారు. దేవాలయంలోని పూజారులు ప్రత్యేకంగా వీరిని గుర్తించి జెండా కర్రను వీరికి ఇచ్చినట్లు పూర్వీకులు తెలిపారు. ఆ జెండాను తీసుకొని వెల్మల్ వచ్చి ఓ అయ్యవార్ల ఇంట్లో ప్రతిష్టాపన చేశారు. అప్పటినుంచి ఆనవాయితీగా ఉత్సవాలను నిర్వహిస్తున్నామని గ్రామస్తులు తెలిపారు.

ఆలయ నిర్మాణం...

గ్రామస్తుల సహకారంతో వెంకటేశ్వర ఆలయాన్ని నిర్మించుకున్నారు.గల్ఫ్ నుంచి కూడా విరాళాలు సేకరించి ఆలయం కొరకు అందించారు. ఆలయం ముందు బాలాజీ జెండా దిమ్మెను నిర్మించి పెద్ద ఎత్తున పూజలు చేయడం ప్రారంభించారు. పెద్దఎత్తున గ్రామం నుంచి ఆ జెండాను నిజామాబాద్ కి తీసుకెళ్ళడం ఆనవాయితీగా వస్తుంది. వెల్మల్ గ్రామంలో వినాయక నిమజ్జనానికి ముందు జెండాను ప్రతిష్ఠించి ఐదు రోజులపాటు పూజలు చేసి తర్వాత జిల్లాలో కొన్ని రోజులు పూజల అనంతరం పౌర్ణమి రోజు జిల్లా జెండా బాలాజీ జెండాతో పాటు కలిపి తిరుపతికి తీసుకువెళ్తారు. ప్రతి ఏడాది భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పూజలు చేస్తారని ఆలయ కమిటీ సభ్యులు చెప్పారు.



1) పూర్వం నుంచి ఆచరిస్తున్నాం.
తల్వేద రాము.

బాలాజీ జెండా ఉత్సవాలను పూర్వం నుంచి తమ గ్రామంలో ఘనంగా నిర్వహిస్తున్నాం. ప్రతి సంవత్సరం బాద్రపద శుద్ధ ఏకాదశి రోజు జెండాను ప్రతిష్టిస్తాం. ఐదు రోజూ పౌర్ణమి రోజున ఉదయం పదకొండు గంటలకు వరకు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, గ్రామస్తులు కొబ్బరికాయ కొట్టి కిలోల కొద్ది చక్కెరతో స్వామివారికి మొక్కులు చెల్లించుకుంటారు. ఆలయ కమిటీ తరపున భక్తులకు అన్నదానం నిర్వహిస్తాం.



ప్రతిరోజు ప్రత్యేక పూజలు
సతీష్ శర్మ ఆలయ పూజారి

ప్రతి రోజు ప్రత్యేక పూజలు చేస్తాం. అభిషేక కార్యక్రమాలు పౌర్ణమిరోజు జెండాను గ్రామంలో ఊరేగిస్తాం. పెళ్లిళ్ల కోసం జెండా కింద నుంచి దాటి భక్తులు మొక్కులు చెల్లించుకుంటారు.

చెవిలో పువ్వుతో ఆశావర్కర్ల నిరసన

- ఆశావర్కర్లు రూ. 18 వేలు పిక్సుడ్ వేతనం ఇవ్వాలని
- సీఐటీయూ జిల్లా నాయకులు కొండ గంగాధర్

నవతెలంగాణ - మాక్లూర్/ఎడపల్లి

ఆశా వర్కర్లకు పారితోషికాలను రూ.18 వేలు లకు పెంచి ఫిక్సిడ్ వేతనం నిర్ణయించాలనీ, ఇతర సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా నాయకులు కొండ గంగాధర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం ముందు చేపట్టిన అశవర్కర్ల సమ్మెకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఆశాలకు నేటికీ ఫిక్స్ వేతనం నిర్ణయం చేయలేదన్నారు. ఆశా వర్కర్లకు పనిభారం విపరీతంగా పెరిగిందన్నారు. పారితోషికంతో పాటు పారితోషికాలు లేని అనేక పనులను ప్రభుత్వం ఆశాలతో చేయిస్తుందన్నారు. రూ.18వేలు ఫిక్సిడ్ వేతనం నిర్ణయించాలని తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్షురాలు గంగమణి కోశాధికారి పి. సవిత,



ఎడపల్లి



మాక్లూర్

సుమలత, వనిత, సరస్వతి, 24 మంది ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఎడపల్లి: నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా సిఐటియు ఆధ్వర్యంలో ఆశావర్కర్లు చేపడుతున్న సమ్మె గురువారానికి నాలుగో రోజుకు చేరుకుంది. ఈసందర్భంగా ఆశ వర్కర్లు చెవిలో పువ్వులు పెట్టుకొని ప్రభుత్వానికి నిరసన తెలిపారు. అనంతరం ఆశ వర్కర్ల జిల్లా సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ గైని రాజమణి మాట్లాడారు. ప్రపంచంలోనే అతి భయంకరమైన కరోనా వ్యాధిని నివారించేందుకు గ్రామాల్లో ప్రజలకు సేవ చేస్తూ వారికి మనోధైర్యాన్ని నింపామని అన్నారు. కేంద్ర ప్రభుత్వం కరోనా సమయంలో విధులు నిర్వహించిన ఆశ వర్కర్లకు నెలకు 1000 చొప్పున గౌరవ వేతనం ఇస్తామని మాట ఇచ్చిందన్నారు. ఆశ్యావర్కర్లకు నెలకు 18వేల గౌరవవేతనంతోపాటు గుర్తింపు కార్డులు, పిఎఫ్ ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తాటి విజయ, కుంట అనిత, దేవకరున్న, విజయలక్ష్మి స్వరూప, శ్యామల, ఆయా గ్రామాల ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

అంగన్వాడీలపై బెదిరింపులు మానుకొని

చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి రమేష్ బాబు డిమాండ్

నవతెలంగాణ-కంఠేశ్వర్

అంగన్వాడీలపై దుష్ప్రచారాన్ని, బెదిరింపులను మానుకోవాలని, చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రమేష్ బాబు డిమాండ్ చేశారు. 18వ రోజు గురువారం ధర్నా చౌక్ లో కొనసాగుతున్న అంగన్వాడీ ఉద్యోగుల సమ్మెలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఏ రమేష్ బాబు పాల్గొని మాట్లాడారు. మహిళలు రోడ్డున పడి తమ హక్కులకోసం పోరాడుతూ ఉంటే సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు ఉండడం తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని అంగన్వాడీ యూనియన్ నాయకులతో చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. రెండు రోజుల నుండి వాట్సాప్‌ల ద్వారా ఫోన్లో మెసేజ్లు పంపుతూ షోకాజ్ నోటీసులను పంపిణీ చేస్తున్నట్లు అంగన్వాడి ఉద్యోగులు విధుల్లో చేరకపోతే విధుల నుండి తొలగిస్తున్నట్లు బెదిరింపులకు పాల్పడుతున్నారని, ఇది చట్ట విరుద్ధమని తెలిపారు. చట్ట ప్రకారం సమ్మె నోటీస్ ఇచ్చి సమ్మె నిర్వహిస్తున్న అంగన్వాడీ కార్యకర్తల పైన ఆయాల పైన దుష్ప్రచారానికి పూనుకోవటం దేశంలో తామే ఎక్కువ వేతనాలు ఇస్తున్నట్లు ప్రచారం చేసుకుంటున్నారని అన్నారు. ఎక్కువ వేతనాలు, ఎక్కువ సౌకర్యాలు కల్పిస్తున్న అనేక రాష్ట్రాలు ఉన్నాయని ఆయన అన్నారు. సమస్యలు పరిష్కరించే వరకు అంగన్వాడీ కార్యకర్తలు చేసే పోరాటానికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడి యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి స్వర్ణ నాయకులు సందీప, హైమావతి, లలిత, రమ తదితరులతోపాటు ఆయాలు కార్యకర్తలు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి:తమ డిమాండ్లు పరిష్కరించాలని, గతంలో ఇచ్చిన హామీలు నెరవేర్చాలని అంగన్వాడీ ఉద్యోగులు చేస్తున్న నిరవధిక సమ్మె



కంఠేశ్వర్ : నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీలు..



బోధన్‌లో సుదర్శన్‌రెడ్డి మద్దతు

కొనసాగుతుంది. మండల కేంద్రంలోని హాస కొత్తూర్ చౌరస్తా వద్ద నిర్వహిస్తున్న నిరవధిక సమ్మెలో భాగంగా గురువారం గ్రామపంచాయతీ సమీపంలోని అంబేద్కర్ విగ్రహం వరకు అంగన్వాడి ఉద్యోగులు ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో అంగన్వాడి టీచర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షురాలు మంజుల, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

సమ్మెకు న్యూ డెమోక్రసీ నాయకుల మద్దతు

అంగన్వాడి ఉద్యోగులకు న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు మద్దతు తెలిపారు. మండల కేంద్రంలోని హాస కొత్తూర్ చౌరస్తా వద్ద ఉద్యోగుల సమ్మె శిబిరాన్ని సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ నిజామాబాద్ జిల్లా కార్యదర్శి బి.భాస్కర్, ఐఎఫ్‌టియు జిల్లా కార్యదర్శ అల్తాఫ్, డివిజన్ అధ్యక్షుడు చిన్నభూమన్న సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా కార్యదర్శి బి.భాస్కర్ మాట్లాడుతూ ప్రభుత్వం కాలయాపన చేయకుండా అంగన్వాడి ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలన్నారు. అంగన్వాడి ఉద్యోగులు గ్రామాల్లో నిరంతరం ప్రజలకు సేవలందిస్తున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం సానుకూలంగా స్పందించి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో న్యూడెమోక్రసీ కమ్మర్ పల్లి సబ్ డివిజన్ కార్యదర్శి పెద్ద అశన్న, అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు దేవగంగు, మండల అధ్యక్షురాలు మంజుల, తదితరులు పాల్గొన్నారు.

ముప్కాల్ :తమ సమస్యలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తొందరగా పరిష్కారించాలంటూ అంగన్‌వాడీ టీచర్లు తహశీల్దార్ కార్యాలయం ఎదుట బోనాలతో నిరసన ప్రదర్శన చేపట్టారు. తహశీల్దార్ కార్యాలయం నుంచి గాంధీ విగ్రహం వరకు బోనాలతో వెళ్లారు. ఈ సందర్భంగా వారికి బీఎస్పీ నాయకులు మద్దతు తెలిపారు. బాల్కొండ బీఎస్పీ నియోజకవర్గ ట్రెజరర్ సుంకే విక్రమ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, సీఎం కేసీఆర్ లేనిపోని ఆర్భాటాలు, హంగులతో మహిళలను మోసం చేస్తున్నారని విమర్శించారు. 18 రోజులుగా మహిళా ఉద్యోగులైన అంగన్ వాడి ఉపాధ్యాయులు రోడ్లపైకి వచ్చి తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్న వారి సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించకుండా కాలయాపన చేస్తుండడం సిగ్గుచేటన్నారు. మరోవైపు ఆరోగ్య శాఖలో ఒక భాగమైన ఆశ వర్కర్ల పట్ల ప్రభుత్వం చిన్న చూపు చూపడం సరైంది కాదన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు రాంజీ చార్వాక పూలే, బెనర్జీ, శేఖర్, రాకేష్, అంగన్ వాడి ఉపాధ్యాయులు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్

అధికారంలోకి వస్తే అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తాం

బోధన్‌టౌన్: కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన వెంటనే అంగన్వాడీలకు ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తామని మాజీ మంత్రి పొద్దుటూరు సుదర్శన్ రెడ్డిఅన్నారు. బోధన్ పట్టణంలోని రాకాసిపేట్ లోని ఎమ్మార్వో ఆఫీస్ ముందు అంగన్వాడీల సమ్మెకు సంఘీభావం తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ఇన్ని రోజులు దీక్ష చేస్తున్న సీఎం కేసీఆర్ ఎలాంటి మాట ఇవ్వకపోవడం శోచనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిఐటీయూ పట్టణ అధ్యక్షులు శంకర్ గౌడ్ అంగన్వాడీలు, బోధన్ పట్టణ అధ్యక్షులు పాషా, మెహమూద్, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.



ముప్కాల్‌లో..



కమ్మర్‌పల్లిలో

ఎమ్మెల్యేను కలిసిన కురుమసంఘం సభ్యులు

నవతెలంగాణ-ధర్పల్లి

మండలకేంద్రానికి చెందిన కురుమ సంఘం, కురుమ యూత్ సభ్యులు గురువారం నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌తో తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. తమ కమ్యూనిటీ హాల్ భవనానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. రెండో విడత గొర్ల పంపిణీ 22 మందికి రావాల్సి ఉందని, అందరికీ వచ్చే విధంగా చూడాలని తెలిపారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే కురుమల అభివృద్ధికి నా సహకారం ఎల్లవేళలా ఉంటుందని హామీనిచ్చారు. కార్యక్రమంలో కురుమ సంఘం పెద్దమనుషులు పాలెం మల్లయ్య, జిర్ర భూమయ్య, ఎల్కపల్లి నరేష్, మాసూరి రాజేశ్వర్మ, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

ఎంఎస్ స్వామినాథన్ మరణం పట్ల మంత్రి సంతాపం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

భారతదేశ హరిత విప్లవ పితామహుడు, ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్ మరణం పట్ల రాష్ట్ర రోడ్లు భవనాలు,శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. స్వామినాథన్ పరిశోధనలతో దేశంలోని ఆహార కొరతను తీర్చారని కొనియాడారు. ఆయన కృషి వల్ల దేశీయంగా ఆహార స్వయం సమృద్ధి సాదించామని తెలిపారు. ఆయన పరిశోధనలతో అధిక దిగుబడులు సాదించడం ద్వారా రైతుల ఆదాయం మెరుగుపడిందని, స్వామినాథన్ మృతి భారతీయ వ్యవసాయ రంగానికి తీరని లోటు అన్నారు. స్వామినాథన్ సేవలు యావత్ రైతులోకం ఎన్నటికీ మరువదన్నారు. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని మంత్రి వేముల ప్రార్థించారు.

ఘనంగా గుర్రం జాషువా జయంతి వేడుకలు

నవతెలంగాణ-కంఠేశ్వర్



నివాళి అర్పిస్తున్న నాయకులు

గుర్రం జాషువా జయంతిని నాందేడ్ వాడలోని కెవిపిఎస్ కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు నలవాల నరసయ్య మాట్లాడుతూ.. జాషువా 128వ జయంతి సందర్భంగా ఆయన స్ఫూర్తిని మనము ముందుకు తీసుకు పోవాల్సిన అవసరం ఉందన్నారు. వివక్షకు వ్యతిరేకంగా పోరాడినటువంటి మహనీయుడు గుర్రం జాషువా అని తెలిపారు. 19వ శతాబ్దంలో దళిత బహుజన ఉద్యమాలకు ముందుకు తీసుకుపోయిన కవి, సంఘసంస్కర్త అన్ని అన్నారు. ఆయన స్ఫూర్తిని ముందుకు తీసుకుపోవాలని తెలిపారు. కార్యక్రమంలో మహేష్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని కోనాపూర్ గ్రామానికి చెందిన బాధిత కుటుంబాలను మండల బిఆర్ఎస్ నాయకులు గురువారం పరామర్శించారు. గ్రామానికి చెందిన టేకుల రాజాం అనారోగ్యంతో మరణించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపాన్ని తెలిపారు. అదే గ్రామానికి చెందిన చెప్పాల నవీన్ అనే బాలుడు ఇటీవల ప్రమాదవశాత్తు వాగులో పడి చనిపోయాడు. బాలుడి కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యుడు పెరుమండ్ల రాజా గౌడ్, మండల అధ్యక్షులు రేగుంట దేవేందర్, స్థానిక సర్పంచ్ దయా దేవయ్య, ఎంపీటీసీ సభ్యుడు లకావత్ గంగాధర్, సింగల్ విండో చైర్మన్ బడాల రమేష్ రెడ్డి, నాయకులు హల్దే శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి

- కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు వినయ్ కుమార్ రెడ్డి

నవతెలంగాణ - మాక్లూర్

ఆర్మూర్ నియోజకవర్గంలోని పలు గణేష్ మండపాల సందర్శించి మిలాద్ ఉల్ నబీ ఉత్సవాల్లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు. ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని,తెలంగాణ లో కాంగ్రెస్ పార్టీ అధికారం లోకి రావాలని కోరుకున్నారు. గురువారం మండల కేంద్రంలోని గణేష్ నిమజ్జనం సందర్భంగా అన్నదాన కార్యక్రమంలో యువజన సభ్యులతో పాల్గొన్నారు. . అనంతరం మిలాద్ ఉల్ నబీ ఉత్సవాల్లో మండల కేంద్రంలో మజీద్ లో ముఖ్య అతిథిగా పాల్గొని మైనారిటీ సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిటిసి, ఆర్మూర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు వెంకటేశ్వర్ రావు, మాక్లూర్ మండల అధ్యక్షులు రవి ప్రకాష్, షేక్ అలీ, షేక్ జాఫర్, మాజీ సర్పంచ్ రాజు, ఆరిఫ్, అబ్దుల్ రెహమాన్, లాయక్ అలీ సాబ్, సయ్యద్, మగ్దూమ్, కాజా ముస్లిం సోదరులు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు

పెర్కిట్‌లో మీలాద్ ఉన్ నబి

నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ పరిధి పెర్కిట్ లో మిలాద్ ఉన్ నబి మహమ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా మైనార్టీ సోదరులు గురువారం శాంతియుత ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ క్లాసిక్ ఫంక్షన్ హాల్ నుండి జామ మసీదు వరకు కొనసాగింది. ఈ సందర్భంగా ఒకరినొకరు మిలాద్ ఉన్ నబి పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో మత పెద్దలు, మున్సిపల్ వైస్ చైర్మన్ మున్ను, షేక్ బాబూ, అబ్దుల్ నయీం,నిజాముద్దీన్, షేక్ అఫ్సర్, షేక్ అంజద్, మైనార్టీలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కృషితోనే రోడ్డు నిర్మాణం

- ఖానాపూర్ సర్పంచ్ సింగిరెడ్డి మోహన్

నవతెలంగాణ ఆర్మూర్

ఎన్నో సంవత్సరాలుగా అస్తవ్యస్తంగా ఉన్న రోడ్డు పనులను ఎమ్మెల్యే, బి ఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, పియుసి చైర్మన్ ఆశన్న గారి జీవన్ రెడ్డి కృషితో తారు రోడ్డు నిర్మాణం చేపడుతున్నారని మండలంలోని ఖానాపూర్ గ్రామ సర్పంచ్ సింగిరెడ్డి మోహన్ గురువారం తెలిపారు. పిప్రి గ్రామం నుండి అందాపూర్, మగ్గిడి, ఖానాపూర్ గ్రామాల వరకు రోడ్డు పనులు కొనసాగుతున్నాయని అన్నారు. రాబోవు ఎన్నికలలో గెలిచి మంత్రిగా మరింత అభివృద్ధి చేస్తారని, బడుగు, బలహీన పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా బి.ఆర్.ఎస్ ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు.


పనులు ప్రారంభిస్తున్న నాయకులు

మంత్రి ప్రశాంత్ రెడ్డికి మద్దతుగా ఏకగ్రీవ తీర్మానం

నవతెలంగాణ-బాల్కొండ

మండలం పరిధిలోని కిసాన్ నగర్ గ్రామానికి చెందిన మోచి సంఘం నుంచి 27 కుటుంబాలు రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డికి మద్దతుగా ఏకగ్రీవ తీర్మాన పత్రాలను గురువారం బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు బద్దం ప్రవీణ్ రెడ్డి, స్థానిక నాయకులకు అందజేశారు. సంఘ సభ్యులు మాట్లాడుతూ ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి కి ఓటు వేస్తామని ప్రమాణం చేస్తూ ఏకగ్రీవ తీర్మానం చేశామని తెలిపారు.మంత్రి ప్రశాంత్ రెడ్డి చేసిన అభివద్ధిని మరవకుండా మళ్లీ ఎమ్మెల్యేగా భారీ మెజారిటీతో గెలిపించేందుకు పూర్తిమద్దతు పలుకుతామని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మానేటి నాగభూషణం, ఎంపీటీసీ అనుగుల రాంరాజ్ గౌడ్, గ్రామ శాఖ అధ్యక్షుడు ఎంబరి శరత్, నాయకులు జున్ను కిషోర్ గౌడ్, మోచి సంఘం అధ్యక్షుడు సింధుల రాజేందర్, ఉపాధ్యక్షుడు వి రాజేందర్, కార్యదర్శి ఎస్ రాజేశ్వర్, దేవ్ రాజ్, కోశాధికారి సింధు శివప్రసాద్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ పోరాట పటిమతో ఉద్యమిద్దాం

- ఎస్ఎఫ్ఐ
- ఘనంగా భగత్ సింగ్ 116వ జయంతి

నవతెలంగాణ-విలేకరులు

కంఠేశ్వర్:భగత్ సింగ్ పోరాట పటిమతో ఉద్యమిద్దామని ఎస్ఎఫ్ఐ నాయకులు అన్నారు. భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) నిజామాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో భగత్ సింగ్ 116 వ జయంతి నిర్వహించారు. గురువారం భగత్‌సింగ్ చౌరస్తాలోనీ భగత్ సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా జయంతి నిర్వహించటం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి బొడ అనిల్ మాట్లాడుతూ.. బ్రిటిష్ ప్రభుత్వాన్ని గడగడలాడించిన భారత విప్లవకారుడు భగత్ సింగ్ అని అన్నారు. దేశ స్వాతంత్రం కోసం మా ప్రాణాలు సైతం లెక్క చేయమని ఆరోజు రాజ్ గురు, సుఖ్ దేవ్, భగత్ సింగ్ చూపించిన తెగువ విద్యార్థులు, యువకులు ఆదర్శంగా తీసుకోవాలని తెలిపారు. మేము చనిపోయిన మా ఆలోచనలు మా ఆశయాలు ఎంతో మంది యువకులను ప్రజలను కదిలించి బ్రిటిష్ ప్రభుత్వాన్ని భారతదేశం నుండి తరిమికొడతారని ఆనాటి బ్రిటిష్ ప్రభుత్వాన్ని హెచ్చరించారన్నారు. భారత విద్యార్థి ఫెడరేషన్ కూడా భగత్ సింగ్ ఆశయాలతోనే ఆవిర్భవించిందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపై అలుపెరగని పోరాటాలు చేస్తూ కుల, మత రహిత సమాజం కోసం కషి చేస్తుందని అన్నారు. అలాగే విద్యార్థులు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగాన్ని కాషాయీకరణ అలాగే ప్రైవేటీకరించే విధానాలకు వ్యతిరేకంగా జరిగే పోరాటాల్లో భగత్ సింగ్‌ను స్ఫూర్తిగా తీసుకొని చురుగ్గా పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నగర అధ్యక్ష కార్యదర్శులు విశాల్ మహేష్



కంఠేశ్వర్ :నివాళి అర్పిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

జిల్లా ఉపాధ్యక్షురాలు దీపిక ఎస్ఎఫ్ఐ నాయకులు గణేష్ సందీప్ శివ బాబురావు తదితరులు పాల్గొన్నారు.

బోధన్‌టౌన్:బోధన్ పట్టణంలోని కేంద్రంలో భగత్ సింగ్ జయంతి వేడుకలను భగత్ సింగ్ యూత్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బోధన్ విద్యార్థి జేఏసీ నాయకుడు శివ కుమార్,రాజు, సంతోష్ , తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో

బోధన్ పట్టణంలోని ఎస్సీ బాలుర కళాశాల వసతి గహంలో ఎస్ ఎఫ్ ఐ నాయకులు భగత్‌సింగ్ జయంతి నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి సాయికుమార్ మాట్లాడుతూ... భగత్ సింగ్ అతిపిన్న వయసులో స్వతంత్ర ఉద్యమం కోసం పోరాడి, 23 ఏళ్లకే ఉరి కంబాన్ని సైతం సంతోషంగా ముద్దాడి నేలకొరిగిన మహనీయుడని కొనియాడారు. ఇంక్విలాబ్ జిందాబాద్ అనే నిదానంతో భారత దేశ స్వతంత్రం కోసం తన ప్రాణం కన్నా దేశం గొప్పదని తణప్రాయంగా తన ప్రాణాలను అర్పించారన్నారు. ఒక్క భగత్ సింగ్ ను చంపితే వందలాది భగత్ సింగ్లు పుడతారని తెలిపారని అన్నారు. భగత్ సింగ్ మనకు ఆదర్శంగా తీసుకొని విద్యారంగంలో ఉన్న సమస్యల కోసం కషి చేయాలని ప్రతి విద్యార్థి ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఎస్ ఎఫ్ ఐ నాయకులు అర్జున్, శివాజీ, రవి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి జేఏసీ ఆధ్వర్యంలో..

షహీద్ భగత్ సింగ్ 116వ జయంతి సందర్భంగా బోధన్ పట్టణం లోని బిసి సంక్షేమ హాస్టల్‌లో భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థి జేఏసీ నాయకులు శివకుమార్ మాట్లాడుతూ... పరాయి పాలన నుంచి భారతమాత దాస్యపు సంకెళ్ల తెచ్చేందుకు ప్రాణాలను అర్పించిన వీర యోధుడని అన్నారు. వారి స్ఫూర్తి తోనే నేటి రైల్వే ఉద్యమం కొనసాగిస్తామని, బోధన్ రైల్వే సమస్యలు పరిష్కరించే వరకు పోరాడుతామని అన్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు మోసిన్, సాయికుమార్, నాగరాజ్, సంజయ్, రామ్ చందర్, సచిన్, రాజేందర్, విద్యార్థులు పాల్గొన్నారు.

నవీపేట్ భగత్ సింగ్ జయంతి సందర్భంగా మండల బీజేవైఎం ఆధ్వర్యంలో గురువారం ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మండల బీజేవైఎం అధ్యక్షులు భాను గౌడ్ మాట్లాడుతూ స్వాతంత్ర ఉద్యమంలో కీలకపాత్ర వహించిన భగత్ సింగ్ మనుషులను చంపగలరు కానీ వారి ఆదర్శాలను ఎప్పటికీ చంపలేరని నలు దిక్కులు పీకటిల్లేల అర్జించిన మహనీయుడు భగత్ సింగ్ చూపిన దారిలో యువత నడవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షులు పిల్లి శ్రీకాంత్, వెంకటేష్, రాజేందర్ గౌడ్, బందెల ఆనంద్, రామకష్ణ, సాయినాథ్, శ్రావణ్, గంగాధర్, ఆకాష్, హరీష్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

నిజామాబాద్ సిటీ

షహీద్ భగత్ సింగ్ జయంతిని పాలిటెక్నిక్ బాలుర హాస్టల్లో పిడిఎస్‌యు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా నిజామాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ కర్క గణేష్ మాట్లాడుతూ, బ్రిటిష్ పాలన నుండి విముక్తికై భారతదేశ స్వాతంత్రానికై అతి చిన్న వయసులో అమరుడైన వ్యక్తి షహీద్ భగత్ సింగ్ అని అన్నారు. ప్రతి ఒక్కరం భగత్ సింగ్ ఆశయాల సాధనకై ముందుకు నడవాలని తెలిపారు. కుల,మత లింగ, వర్గ భేదాలు లేని సమాజానికై భగత్ సింగ్ పోరాడారని కొనియాడారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకులు తిరుమలేష్, శ్రీకాంత్, రిషికేష్, త్రిషరన్, సూర్య, రఘురాం, రఘునాథ్, భారత్, జోష్నా, మనష్, విష్ణు, రేశ్వాంత్ తదితరులు పాల్గొన్నారు.

యాదవ వధూవరుల వివాహ పరిచయ వేదికను విజయవంతం చేయండి

నవతెలంగాణ - ముప్కాల్

జిల్లా యాదవ వధూవరుల వివాహ పరిచయ వేదికను విజయవంతం చేయాలని యాదవ సంఘం బాల్కొండ నియోజకవర్గ కన్వీనర్, జిల్లా కమిటీ సభ్యులు శ్రీకాంత్ యాదవ్ కోరారు. గురువారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ అక్టోబర్ 15న మండల కేంద్రంలోని జీఎస్ఆర్ గార్డెన్‌లో ఈ ఉచిత వివాహ పరిచయ వేదికను ఏర్పాటు చేస్తున్నామన్నారు. జిల్లా నలుమూలల ఉన్న యాదవ కులస్తులు ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వచ్చే వారి సౌకర్యార్థం భోజన వసతి కల్పిస్తున్నట్లు తెలిపారు. అక్టోబర్ 10వ తేదీ లోపు వధూవరుల కుటుంబసభ్యులు తమ తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్ కోసం 9010787050, 9912398898, 9440360416, 9398373131 నంబర్లను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా యాదవ వధూవరుల వివాహ పరిచయ వేదిక కమిటీ సభ్యులు గోల్కొండ మహేష్ యాదవ్, గడ్డం సాయన్న యాదవ్, ఏట్టెం మహేష్ యాదవ్, చింతల గంగాధర్ యాదవ్, కట్ట మహేష్ యాదవ్, సాగర్ యాదవ్, రాజమల్లు యాదవ్, మెరుగు సురేష్ యాదవ్ తదితరులు ఉన్నారు..

కాంగ్రెస్ పార్టీలో చేరిక


కాంగ్రెస్‌లో చేరిన వారికి కండువాలు కప్పుతున్న సునీల్‌రెడ్డి

నవతెలంగాణ-మోర్తాడ్

మండలంలోని పాలెం గ్రామానికి చెందిన పలు వివిధ పార్టీ నాయకులు కాంగ్రెస్ పార్టీలో గురువారం చేరారు. కాంగ్రెస్ నాయకుడు ముత్యాల సునీల్ కుమార్ రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరిక అయినట్లు తెలిపారు. బిఆర్ఎస్ ప్రభుత్వం హయంలో ప్రజలు దోపిడీకి గురయ్యారని అన్నారు. నిరుపేద ప్రజలకు అందాల్సిన సంక్షేమ పథకాలను నాయకులు దోచుకు తింటున్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే నిరుపేదలకు న్యాయం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు రాములు మైనార్టీ అధ్యక్షుడు ఇంతియాజ్ తో పాటు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పడకల్ గ్రామంలో 16 కోట్లతో అభివృద్ధి పనులు

- ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్


ఎమ్మెల్యేకు గజమాలతో సత్కరిస్తున్న నాయకులు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని పడకల్, కలిగొట్ చింతలూరు గ్రామాలలో పర్యటించి పలు అభివృద్ధి పనులను రాష్ట్ర ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ ప్రారంభించారు. పడకల్ గ్రామంలో 16 కోట్లతొ అభి--వద్ధి పనులను ప్రారంభించారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం-అర్గుల్ పరిధిలోని పడకల్ గ్రామంలో చైర్మెన్ ఆర్మూర్ గంగారెడ్డి ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన 500 ఎంటి గోడౌన్‌ను ప్రారంభించారు. చందా మీయ బాగ్ నుంచి పడకల్ కలిగోట్ చింతలూరు చేంగల్ వరకు వేసిన బీటి డబల్ రోడ్డును ప్రారంభించారు. అర్గుల్ సింగిల్ విండో సంఘ పరిధిలోని గ్రామాల రైతులకు కోటీ నాలుగులక్షల 75వేల క్రాప్‌లోన్ చెక్కులను పంపిణీ చేశారు. పడకల్ మహిళా సంఘం భవనాన్ని ప్రారంభించారు. అనంతరం పడకల్లో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ధర్పల్లి జెడ్పీటీసీ బాజిరెడ్డి జగన్, జక్రాన్ పల్లి జెడ్పీటీసీ పట్కురి తనూజ శ్రీనివాస్, ఎంపీపీ కుంచాల విమల రాజు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ లికేజీలు పట్టని అధికారులు


వృథాగా వెళ్తున్న నీరు..

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని పద్మాజివాడి డబుల్ బెడ్ రూం వద్ద లికేజ్ అయి నెలలు గడుస్తున్నా పట్టించుకునే నాథుడే లేడని గ్రామ ప్రజలు ఆరోపిస్తున్నారు. నీటితో బట్టలు ఉతుకున్నారు. సుమారు రెండు మూడు పంపు సెట్ల నీరు వృథాగా పోతుందని, దీంతో పాటు కలుషితం అవుతున్నదని తెలిపారు. నీరు కలిషితమవుతున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

రెండు మెడికల్ షాపులు సీజ్

నవతెలంగాణ-రామారెడ్డి

మండల కేంద్రంలోని రెండు మెడికల్ షాపులను డ్రగ్స్ అధికారులు సీజ్ చేసినట్టు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. నిషేధి మాత్రలు దొరకటం, రికార్డులు సరిగా లేకపోవడంతో డ్రగ్స్ ఇన్స్పెక్టర్ సస్పెన్షన్ ఈనెల 30 వరకు విధించిన, మళ్లీ మెడికల్ షాపులను తెరవడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. డ్రగ్ ఇన్స్పెక్టర్ రాజిరెడ్డి వివరణ కోరగా... రామారెడ్డి లో రెండు మెడికల్ షాపుల రికార్డులు సరిగా లేకపోవడంతో వేటు వేశామని, శనివారం వరకు వేశామని తెలిపారు.

క్రీడల్లో సత్తా చాటిన మైనారిటీ బాలికల గురుకుల విద్యార్థినులు



గురుకుల విద్యార్థినులు

నవతెలంగాణ-బాల్కొండ

నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలోని 10 టీఎంఆర్ఈఎస్ ఇన్స్టిట్యూషన్స్ కు చెందిన బాలికలకు ప్రతి స్కూల్ నుండి 10 మంది ఈనెల 25, 26, 27 తేదీల్లో నిర్వహించిన పోటీల్లో పాల్గొన్నారు. అందులో బాల్కొండలోని మైనార్టీ బాలికల గురుకుల పాఠశాలకు చెందిన అమ్మాయిలు విజయ ప్రభంజనం సష్టించారు. వాలీబాల్ జూనియర్స్ ఫస్ట్ ప్రైజ్, వాలీబాల్ సబ్ జూనియర్స్ ఫస్ట్ ప్రైజ్, రన్నింగ్ 200 మీటర్స్ ఫస్ట్ ప్రైజ్, రన్నింగ్ 800 మీటర్స్ ఫస్ట్ ప్రైజ్, రన్నింగ్ 600 మీటర్స్ ఫస్ట్ ప్రైజ్, రన్నింగ్ 400 మీటర్స్ ఫస్ట్ ప్రైజ్, రన్నింగ్ 1500 మీటర్స్ థర్డ్ ప్రైజ్ కైవసం చేసుకున్నారు. ఉమ్మడి జిల్లాలో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన స్కూల్స్‌తో పోల్చుకుంటే అధిక పాయింట్స్ రావడంతో బాల్కొండ మైనారిటీ బాలికల స్కూల్‌కి ఓవర్ ఆల్ ఛాంపియన్ షిప్ బహూకరించారని ప్రిన్సిపాల్ వాణి తెలిపారు. పిఈటి సౌజన్య ప్రోత్సాహంతో విద్యార్థులు ఉత్తమ ప్రదర్శన కనబరిచారని ప్రిన్సిపాల్ వాణి , టీచర్స్ పిఈటీని అభినంది హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నిజామాబాద్ మేయర్ నీతు కిరణ్, డిస్టిక్ సెషన్స్ జడ్జ్ సునీత కుంచాల, డిఎండబ్ల్యూఓ కష్ణవేణి, సిడబ్ల్యూడిఓ రసూల్ బి, డిఐఓ యూసుఫ్ అలీ, ఆర్ఎల్సీ మహమ్మద్ బషీరుద్దీన్, విజిలెన్స్ ఆఫీసర్ షేక్ అహమ్మద్ జియా. హమీదుద్దీన్. కోఆర్డినేటర్ ప్రవీణ్ పాల్గొన్నారు.

మోకాళ్లపై నిలబడి నిరసన


మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీలు

నవతెలంగా-వర్ని

మోస్రా మండలం, వర్ని మండల కేంద్రాలలో అంగన్వాడీ టీచర్స్ తమను ప్రభుత్వం ఉద్యోగులుగా గుర్తించి, చర్చలకు ప్రభుత్వం పిలుపు ఇవ్వాలని మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు.

దుప్పట్లు పంపిణీ


దుప్పట్లు అందజేస్తున్న రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు

నవతెలంగాణ-మద్నూర్

భారీ వర్షాల మూలంగా ఇండ్లు కూలిపోయిన బాధితులకు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ చేశారు. మద్నూర్ మండలంలోని రాచూర్, అవల్గావ్, మద్నూర్ లోనిబాధితులకు టార్పలిన్‌లు, దుప్పట్లు, మద్నూర్ మండల ఐఆర్సిఎస్ చైర్మన్ ప్రకాష్, డివిజన్ వైస్ చైర్మన్ డాక్టర్ విక్రమ్ కుమార్, ఈ కార్యక్రమంలో రాచూర్ సర్పంచ్ పార్వతి బాయ్ శంకర్ పటేల్, మద్నూర్ సర్పంచ్ దరాస్ సురేష్, మద్నూర్ పంచాయతీ సెక్రెటరీ సందీప్, అవల్గావ్ సర్పంచ్ శాంతేశ్వర్ బాధ్యతలు పాల్గొన్నారు.

చంద్రబాబుకు పట్టిన గతే కేసీఆర్ ప్రభుత్వానికి పడుతుంది

- సీఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్

నవతెలంగాణ-మోపాల్

సమ్మెలో ఉన్న అంగన్‌వాడీలు, ఆశాల సమస్యలపై నిర్లక్ష్యం వహిస్తే చంద్రబాబుకు పట్టిన గతే కేసీఆర్ ప్రభుత్వానికి పడుతుందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 18 రోజులుగా సమ్మెలో ఉన్న అంగన్వాడీ, 4 వ రోజు నుండి సమ్మె లో పాల్గొంటున్న ఆశా వర్కర్లు సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని సీఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్ అన్నారు. గురువారం తహసీల్దార్ కార్యాలయం నుండి అంగన్వాడీలు, ఆశాలు ర్యాలీగా వెళ్లి మోపాల్ చౌరస్తా వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్ మాట్లాడుతూ.. కనీస వేతనం,పర్మినెంట్,ఉద్యోగ భద్రత తదితర సమస్యలు అత్యంత న్యాయమైనవని అన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్మిక చట్టాల ప్రకారం చూసినా,అంతర్జాతీయ లేబర్ కాన్ఫరెన్స్ చెప్పిన దాని ప్రకారం చూసినా ఈ రోజు ఉన్న ధరల్లో కనీస వేతనం కేవలం 26 వేలు మాత్రమే అడుగుతున్నారని,ఈ మాత్రం వేతనం ఇవ్వడానికి ప్రభుత్వానికి చేతులు రావడం లేదని అన్నారు. అనేక వేల కోట్ల రూపాయలు వధా ఖర్చులు చేసే ప్రభుత్వానికి అంగన్వాడీ,ఆశా కార్మికుల వేతనాలు పెంచడం పెద్ద సమస్యే కాదని అన్నారు. ఉద్యోగులుగా గుర్తించకుండా పని చేసినంత కాలం గౌరవ వేతనం తో వెట్టి చాకిరీ చేయించుకుంటు న్నారని అన్నారు. ఎన్నికల షెడ్యూల్ వచ్చే నాటికి అంగన్వాడీ, ఆశా వర్కర్లు సమ్మె సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం లో అలసత్వం ప్రదర్శించినా, యూనియన్ లను చర్చలకు పిలవకపోయినా అవసరమైతే ప్రత్యక్ష కార్యాచరణకు సిద్ధం అవుతామని హెచ్చరించారు. కార్యక్రమం లో అంగన్వాడి యూనియన్ జిల్లా నాయకురాలు సూర్య కళ రాజ్యలక్ష్మిఆశ యూనియన్ జిల్లా కోశాధికారి రేణుక లతా సరిత రజిత వసంత్ తదితరులు పాల్గొన్నారు.


నినాదాలు చేస్తున్న నాయకులు అంగన్‌వాడీలు, ఆశాలు

భీమేశ్వర వాగులో కొట్టుకుపోయిన 100 గేదెలు

- వాగు ఉధ్రుతిని గ్రహించని పశువుల కాపరులు
- బోరుమంటున్న రైతులు

నవతెలంగాణ-తాడ్వాయి

తాడ్వాయి మండలం సంతాయిపేట భీమేశ్వర వాగులో సుమారు 100 గేదెలు గురువారం సాయంత్రం వాగు ఉధృతిలో కొట్టుకుపోయినట్లు స్థానికులు తెలిపారు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మధ్యాహ్నం నుంచి కురిసిన భారీ వర్షానికి భీమేశ్వర వాగు ఉప్పొంగి ప్రవహించింది. వాగు ప్రవహించే ప్రాంతంలో చిట్యాల సంతాయిపేట గ్రామాల పరిధిలో వర్షం లేకపోవడంతో పశువుల కాపరులు భీమేశ్వర వాగు ఉధృతిని పసిగట్టలేకపోయారు. ప్రతిరోజు మాదిరిగానే సంతయిపేట గ్రామం నుంచి గేదెలను మేపడం కోసం భీమేశ్వర వాగు దాటించి తీసుకువెళ్లారు సాయంత్రం వరకు మేత మేసిన గేదెలు తిరిగి ఇంటికి వచ్చే క్రమంలో వాగులో చిక్కుకొని వరద నీటిలో కొట్టుకుపోయాయి. మొత్తం 200 గేదెల వరకు ఉండగా అందులో 100 గేదేలు ఈదుకుంటూ, రాళ్ళ మధ్యన చిక్కుకొని బయటకు వచ్చాయి. మిగతా గేదెల ఆచూకీ కోసం గ్రామస్తులు, రైతులు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. దొరికిన గేదెను దొరికినట్లు ఒడ్డుకు చేరుస్తున్నారు. సంతాయిపేట పరిసర ప్రాంతాల్లో వర్షం లేకపోవడంతోనే వాగు ప్రవహించే తీరును పశువుల కాపరులు గ్రహించలేకపోయారని స్థానికులు వాపోతున్నారు. ఏదేమైనా భారీ ప్రమాదం జరిగిందని వారు తెలిపారు. ప్రమాదవశాత్తు గేదెలు కొట్టుకుపోయినందున ప్రభుత్వం స్పందించి ప్రతి రైతుకు ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని గ్రామ సర్పంచ్ శెట్పల్లి భాగ్యలక్ష్మి శ్రీనివాస్, ఉప సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి లు కోరుతున్నారు


వరద ఉధృతికి కొట్టుకుపోతున్న గేదెలు

మంత్రి కేటీఆర్ వ్యాఖ్యలపై నిరసన

నవతెలంగాణ-ఆర్మూర్

ప్రధాని నరేంద్ర మోడీపై రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మాత్యులు కేటీఆర్ వ్యాఖ్యలు సరైనవి కావని బిజెపి పట్టణ అధ్యక్షులు ద్యాగ ఉదయ్ ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తాలో గురువారం అంబేద్కర్ విగ్రహం ముందు నిరసన కార్యక్రమం నిర్వహించారు. సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి జీవీ నరసింహారెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి జెస్సు అనిల్ కుమార్, అసెంబ్లీ కన్వీనర్ పాలెపు రాజు రెడ్డి మాట్లాడుతూ....పలు అభివద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసేందుకు ప్రధాని నరేంద్ర మోడీ పాలమూరుకు వస్తుంటే బీఆర్ఎస్ నేతలు, ప్రధానంగా కేటీఆర్ జీర్ణించుకోలేకపోతున్నారని అన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ తెలంగాణకు వస్తున్నారని తెలియగానే కేసీఆర్ కు జ్వరం వచ్చి ఫామ్ హౌస్ లో పడుకున్నాడని ఎద్దేవాచేశారు. అది వైరల్ ఫీవర్ కాదని అది మోడీ ఫీవర్ అని అన్నారు. కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు ఆకుల శ్రీనివాస్, బిజెపి పట్టణ కార్యదర్శి పులి యుగంధర్, ఉపాధ్యక్షులు పల్లె శ్రీనివాస్, గిరిజన మోర్చ పట్టణ అధ్యక్షులు కేలోత్ పీర్ సింగ్, బీజేవైఎం పట్టణ ప్రధాన కార్యదర్శి ఉదయ్ గౌడ్, ఉపాధ్యక్షులు పెద్దొల్ల భరత్, దళిత మోర్చ పట్టణ ప్రధాన కార్యదర్శి కష్ణ, కిసాన్ మోర్చ పట్టణ కార్యదర్శి ఈ రెడ్డి నవీన్, ఓబీసీ మోర్చా పట్టణ కార్యదర్శి భవాని రాము,బారడ్ వినోద్ తదితరులు పాల్గొన్నారు.

క్రిస్టియన్ మైనార్టీల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోంది

- రాష్ట్ర మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

క్రిస్టియన్ మైనార్టీల అభివృద్ధి కి ప్రభుత్వం కృషి చేస్తోంది, ప్రతి గడపకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందాలనేది ముఖ్యమంత్రి కేసీఆర్ కోరిక అని రాష్ట్ర రోడ్లు భవనాల, గృహ నిర్మాణ, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు.గురువారం వేల్పూర్ మండలం లక్కోరా ఏఎన్ జి ఫంక్షన్ హాల్లో జరిగిన బాల్కొండ నియోజకవర్గంలోని క్రిస్టియన్ మైనారిటీ చర్చ్ ల అభివృద్ధి కొరకు మంజూరైన నిధుల ప్రొసీడింగ్ కాపీలను ఆయా చర్చ్ కమిటీల సభ్యులకు మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని సుమారు 40 చర్చిలకు రూ.2.75 కోట్ల నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి కేసీఆర్ కు మంత్రి కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ.... కులాలకు, మతాలకు, వర్గాలకు అతీతంగా ప్రజల ముఖాల్లో ఆనందం చూడాలనేది కేసిఆర్ ధ్యేయమని,ప్రతి గడపకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందాలనేది ఆయన కోరిక అన్నారు. క్రిస్టియన్ మైనార్టీల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. అనంతరం ఆయా గ్రామాల సంఘాలకు ప్రొసీడింగ్స్ అందజేశారు. కార్యక్రమంలో క్రిస్టియన్ మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ రాజేశ్వర్ రావు, తెలంగాణ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ మధుశేఖర్, కోటపాటి నరసింహ నాయుడు, హైదరాబాద్ నుండి వచ్చిన దైవ జనులు మోహన్ బాబు, జోనాథన్, నియోజకవర్గ సీనియర్ ఫాస్టర్ షడ్రక్, ఆనంద పాల్, అన్ని చర్చ్ ల ఫాస్టర్ లు, తదితరులు పాల్గొన్నారు.